Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 142 మేడ్చల్ మల్కాజ్‌గిరి 13 జూన్ 2023 మంగళవారం పేజీలు : 4

## 5జీ స్పెక్ట్రమ్ వేలంలో భారీ అవినీతి

చెన్నై : ఇటీవల ముగిసిన 5జీ స్పెక్ట్రమ్ వేలం పాటలలో భారీ స్థాయి అవినీతి చోటుచేసుకుందని డీఎంకే ఎంపీ ఎ. రాజా ఆరోపించారు. ఢిల్లీలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం 5జీ స్పెక్ట్రమ్ వేలం పాటల ద్వారా రూ. ఐదు లక్షల కోట్ల వరకూ ఆదాయం లభిస్తుందని గొప్పలు చెప్పుకొందని, అయితే రూ. 1.25 లక్షల కోట్లకే వేలంపాటను ఖరారు చేసిందని చెప్పారు. ఈ వేలం పాటల ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లు రూ. ఐదు లక్షల కోట్ల మేరకు ఆదాయం రాకపోవడంతో ఈ వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగి ఉంటుందని ఆయన ఆరోపించారు.

# గద్వాల జిల్లాపై కేసీఆర్ వరాల జల్లు

## 255 పంచాయతీలకు రూ. 10 లక్షల చొప్పున నిధులు



జోగులాంబ గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లాపై ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలకు, మండల కేంద్రాలకు, మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. గద్వాల జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం అయిజ రోడ్డులో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. గద్వాల జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు.. 12 మండలాలు.. నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయని కేసీఆర్ తెలిపారు. ఇది వరకు ఇక్కడకు రాలేదు.. తొలిసారి వచ్చిన కాబట్టి.. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడానికి రూ. 10 లక్షల చొప్పున ప్రత్యేక గ్రాంట్ మంజూరు చేస్తున్నాం. దాంతో బాగా చేసుకోవాలని కోరుతున్నాను. మండల కేంద్రాలను అభివృద్ధి చేయడానికి ప్రతి మండల కేంద్రానికి రూ. 15 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నాను. గద్వాల మున్సిపాలిటీ చాలా పెద్ద మున్సిపాలిటీ. గద్వాల మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ. 50 కోట్లు, మిగిలిన మూడు మున్సిపాలిటీలకు రూ. 25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నాను. ఈ నిధులతో మున్సిపాలిటీలు బాగుపడాలి. అద్భుతమైన పనులు జరగాలి. ఇంకా మనం ముందుకు పోవాల్సిన అవసరం ఉంది. వాటన్నింటిని మనం సాధించుకుందాం. గట్టు ఎత్తిపోతల పథకాన్ని, అలంపూర్‌లో ఆర్డీఎస్‌కు కొనసాగింపుగా ఉన్న మల్లమ్మ కుంట పథకాన్ని వీలైనంత తొందరలో పూర్తి చేస్తామని మనవి చేస్తున్నాను అని కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

**గట్టు లిఫ్ట్ పూర్తయితే గద్వాల వజ్రపు, బంగారు తునక అవుతుంది** : గట్టు ఎత్తిపోతల పూర్తయితే గద్వాల వజ్రపు, బంగారు తునక అవుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు.

గద్వాల జిల్లాకు మెడికల్ కాలేజీ కూడా రాబోతుందని కేసీఆర్ తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. గద్వాల జిల్లా పరిపాలన భవనం తన చేతుల మీదుగా ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది అని కేసీఆర్ తెలిపారు. హృదయపూర్వకంగా జిల్లా ప్రజాప్రతినిధులను, ఉద్యోగులను, ప్రజలను అభినందిస్తున్నానని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ రోజు దేశంలో తెలంగాణ అనేక రంగాల్లో అగ్రస్థానంలో ఉంది. పర్ క్యాపిట ఇన్‌కంలో, పర్ క్యాపిట పవర్ యుటిలైజేషన్‌లో, ఓడీఎఫ్ ప్లస్‌లో కూడా నంబర్ వన్‌లో ఉన్నాం. అన్నింటికి మించి ఉద్యమ సమయంలో ఇదే గద్వాలలోని నడిగడ్డకు వచ్చినప్పుడు.. ఓ ఊరికి వెళ్లాను. చాలా ఆవేశం వచ్చి అక్కడ తాను, ప్రజలు ఏడ్చేశాం. ఏడవ్వాల్సిన సందర్భం ఎందుకు వచ్చిందంటే.. రెండు నదుల మధ్య ఉన్న నడిగడ్డకు నీళ్లు రాలేదని. అందుకోసం పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో అభివృద్ధి చేసుకుంటున్నాం. గట్టు లిఫ్ట్ పూర్తయితే అసలు గద్వాల వజ్రపు, బంగారు తునక అవుతుంది. తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా ఆర్డీఎస్‌ను మళ్లీ సాధించుకున్నాం. అలంపూర్ కూడా అద్భుతంగా తయారు కాబోతుంది. రాబోయే రోజుల్లో ఇంకా సాధించాల్సి ఉందని ఉద్యోగులకు కేసీఆర్ సూచించారు.

ప్రభుత్వంలో మీరు చాలా ఏండ్లు పని చేస్తున్నారు. మానవీయ కోణంలో ఆలోచించి అనేక స్టెప్స్ తీసుకుంటున్నాం. స్టంటింగ్ ప్రాబ్లం అని ఒకటి ఉంటుంది. పిల్లల పెరుగుదల ఆగిపోతే దానికి కారణం మాల్ న్యూట్రిషన్ కారణం. ఒకసారి ఒక జనరేషన్ స్టంటింగ్ బారిన పడితే.. అది రిపేర్ కావడానికి 150 సంవత్సరాలు పడుతుంది. మన దగ్గర లాంటి బాధ రావొద్దనే అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ప్రపంచంలో ఎవరూ ఆలోచించని విధంగా కంటి వెలుగు కార్యక్రమం తీసుకున్నాం. ఇలాంటి హ్యూమన్ యాంగిల్ ప్రపంచంలో ఎక్కడా కనిపించదు. ప్రజల ఆయురారోగ్యాలు బాగుండాలని అనేక కార్యక్రమాలు తీసుకొని ముందుకు పోతున్నాం అని కేసీఆర్ పేర్కొన్నారు.

## అమిత్ షా తెలంగాణ పర్యటన.. షెడ్యూల్ ఇదే

హైదరాబాద్: కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా త్వరలో తెలంగాణలో పర్యటించనున్నారు. ఈమేరకు ఆయన షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 15వ తేదీన భద్రాచలంలో రాములవారి దర్శనంతో షా పర్యటన ప్రారంభంకానుంది. దీని కోసం 15న ఉదయం 11గంటలకు ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి కేంద్ర మంత్రి చేరుకోనున్నారు. ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు అల్పాహారానికి కేటాయించారు. ఈ సమయంలో ముఖ్య నేతలతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం



1.10 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి భద్రాచలానికి బయల్దేరతారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.20 మధ్యలో రాములవారిని అమిత్‌షా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తర్వాత ఎస్‌ఆ ర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో భాజపా బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. సభ అనంతరం సాయంత్రం 6 గంటలకు తిరిగి శంషాబాద్‌కు బయల్దేరుతారు. రాత్రి 7 గంటలకు పలువురు నేతలతో వేర్వేరుగా సమావేశం కానున్నారు. రాత్రి 9.30 గంటలకు శంషాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో అమిత్‌షా దిల్లీకి పయనమవుతా రు. పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను త్వరలో భాజపా రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ ఛైర్మన్‌గా నియమిస్తారనే ప్రచారం నేపథ్యంలో నేతలతో అమిత్‌షా నిర్వహించే సమావేశాలకు ప్రాధాన్యం ఏర్పడింది.

# 'కేసీఆర్ రూటే... సపరేటు'

## సచివాలయం అయిపోయింది ఇప్పుడు కొత్త అసెంబ్లీ మీద సారు ఫోకస్?

హైదరాబాద్ : కొత్త ఒక వింత.. పాత ఒక రోత అన్న సామెతకు తగ్గట్లే ఉంటుంది తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తీరు చూస్తుంటే. సుబ్బరంగా ఉన్న నిర్మాణాలకు బదులుగా వేలాది కోట్లు ఖర్చు పెట్టేసి భారీ.. ఖరీదైన భవనాల్ని నిర్మించటం.. ఏర్పాటు చేయటం మీద ఆయనకున్న ఆసక్తి అంతా ఇంతా కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి.. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే ఈ ధోరణిని ఆయన దాచుకోలేదు. తొలుత ముఖ్యమంత్రి అధికార నివాసం మీద ఫోకస్ చేసిన ఆయన.. తన అభిరుచికి తగ్గట్లు.. ప్రగతి భవన్ ను నిర్మించుకోవటం తెలిసిందే. అందుకోసం పెట్టిన ఖర్చు లెక్క తెలిసిందే. ఇదిలా ఉండగా.. మరోపాతిక నుంచి నలభై ఏళ్ల వరకు నడిచే అవకాశం ఉన్నప్పటికీ.. కాదని మొత్తంగా కూల్చేసి.. దాని స్థానే భారీ ఖర్చుతో కొత్త సెక్రటేరియట్ ను ఏర్పాటు చేయటం తెలిసిందే. నమ్మకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే కేసీఆర్ కు పాత సెక్రటేరియట్ వాస్తు మీద ఉన్న సందేహాలు..దాని ఆయువు తీరేలా చేసిందన్న మాట తరచూ వినిపిస్తూ ఉంటుంది. గత ముఖ్యమంత్రులు.. సెక్రటేరియట్.. ముఖ్యమంత్రి అధికారిక నివాసాల కోసం హంగుల కోసం ఖర్చులు చేసే వారే తప్పించి.. మొత్తంగా కొత్త భవనాలు కట్టించుకోవాలన్న ధైర్యసాహసాలు చేసింది లేదు. ఆ విషయంలో మిగిలిన సీఎంల (ఉమ్మడి రాష్ట్ర ముఖ్య మంత్రులతో పోలిస్తే) కంటే ఆయన చాలా ముందుంటారు. కొత్త సెక్రటేరియట్ ను ఏర్పాటు చేసిన తర్వాత నుంచి ఆయన సెక్రటేరియట్ కు రావటం మొదలుపెట్టినట్లుగా చెబుతున్నారు. దీనికి తగ్గట్లే.. చాలా సమీక్షలు కొత్త సెక్రటేరియట్ లో జరగటం తెలిసిందే. ఇప్పుడు కేసీఆర్ ఫోకస్.. కొత్త అసెంబ్లీ భవనం మీద పడినట్లుగా చెబుతున్నారు. ఇప్పుడున్న అసెంబ్లీ తన అభిరుచికి అనుగుణంగా లేకపోవటంతో.. తన అభిరుచికి అద్దం పట్టేలా కొత్త అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలన్న ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. దీనికి సంబంధించిన అనువైన స్థలం కోసం అధికారులు వెతుకుతున్నట్లు చెబుతున్నారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రి రోడ్డులోని పాటిగడ్డలో ఉన్న 40 ఎకరాల భూమి కానీ.. ఆదర్శ్ నగర్ లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ కూడా ప్రస్తుతం నిరుపయోగంగా ఉందని.. ఆ ప్రాంగణంలో 17 ఎకరాలు అందుబాటులో ఉన్నందున.. అక్కడ అసెంబ్లీ భవనాన్ని నిర్మిస్తే బాగుంటుందన్న ఆలోచనలో ఉన్నట్లుగా చెబుతున్నారు. నిజానికి కొత్త అసెంబ్లీ భవనం మీద కేసీఆర్ కు ఉన్న ఆసక్తి అంతా ఇంతా కాదు. గతంలో దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేసినా..



అవేమీ ముందుకు వెళ్లలేదు. 2019లో అసెంబ్లీ కొత్త భవన నిర్మాణానికి ఎర్ర మంజిల్ ప్యాలెస్ స్థానంలో చేయాలని చూసినా.. తీవ్ర విమర్శలు వెల్లువెత్తటంతో తగ్గారు. నిజానికి అక్కడ భూమి పూజ కూడా జరగటాన్ని మర్చిపోకూడదు. ఎర్రమంజిల్ భవనం వారసత్వ కట్టటం కావటం.. అద్భుతమైన నిర్మాణ శైలితో కూడుకున్నది కావటంతో దాన్ని కూల్చాలన్న నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తమైంది. కొందరు కోర్టును కూడా ఆశ్రయించటంతో.. కొత్త అసెంబ్లీ నిర్మాణం అక్కడ ఆగిపోయింది. అనంతరం పబ్లిక్ గార్డెన్స్ మీద ఫోకస్ చేసినా.. అక్కడున్న భారీ చెట్లను కూల్చేసి వస్తే వ్యతిరేకత వస్తుందన్న ఆలోచనతో దాన్ని పక్కన పెట్టేశారు. మొత్తంగా కొత్త అసెంబ్లీ భవన నిర్మాణం మీద ప్రత్యేక ఆసక్తితో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నట్లుగా చెబుతున్నారు. రాజు తలుచుకుంటే కొత్త భవనాలు రాకుండా ఉంటాయా?




# గెలిచి తీరాల్సిందే!

## కర్ణాటక ఫార్ములా తెలంగాణలోనూ!!

## వ్యూహం రచిస్తున్న కాంగ్రెస్ హైకమాండ్!!

హైదరాబాద్ : వరుస ఎదురుదెబ్బల అనంతరం వచ్చే సక్సెస్ ఇచ్చే సంతోషం ఎంతన్నది కర్ణాటక కాంగ్రెస్ నేతల్ని చూస్తే అర్థమవుతుంది. ఒక బలమైన రాష్ట్ర పగ్గాలు సాధించాలన్న కోరిక కాంగ్రెస్ కు తీరింది. గడిచిన కొన్నేళ్లుగా విజయావలకు దూరంగా.. ఓటములకు దగ్గర అవుతున్న వేళ.. గ్రూపుల్ని.. పంచాయితీల్ని పక్కన పెట్టి మూకుమ్మడిగా కలిసి పోరాడిన దానికి బదులుగా కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని సాధించింది. కర్ణాటక ఎన్నికల సందర్భంగా టికెట్ల పంపిణీ విషయంలో తాము అమలు చేసిన ఫార్ములాను.. తాజాగా తెలంగాణలోనూ అమలు చేయాలన్న యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. కర్ణాటక తరహాలోనే తెలంగాణలోనూ టికెట్లను కేటాయించాలన్న అభిప్రాయం పార్టీ అధినాయకత్వంలో ఉన్నట్లుగా చెబుతున్నారు. తెలంగాణలో బలమైన ఓటు బ్యాంకు ఉన్న బీసీలను ఒక తాటి మీదకు తీసుకురావటం.. వారిని తమవైపునకు తిప్పుకునేలా చేయగలిగితే.. తెలంగాణ ఎన్నికల్లో విజయం సాధించటం పెద్ద కష్టం కాదన్న మాట వినిపిస్తోంది. తెలంగాణలో బీసీ వర్గాల ఓటు బ్యాంకు భారీగా ఉన్నా.. వారి మధ్య ఉన్న అనైక్యత.. కలిసి కట్టుగా ఓటును ఒక పార్టీకి వేయాలన్న దానిపై ఏకాభిప్రాయం లేని నేపథ్యంలో.. వారందరిని ఒక తాటి మీదకు తీసుకురావాలన్నది కాంగ్రెస్ ఆలోచనగా చెబుతున్నారు. ఈసారి ఎన్నికల్లో బీసీ నేతలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్న యోచనలో పార్టీ ఉన్నట్లుగా చెబుతున్నారు. టికెట్ల కేటాయింపుతో సరిపెట్టకుండా పార్టీ విధానాల విషయంలో బీసీలకు పెద్ద పీట వేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. విద్య.. ఉద్యోగ రంగాల్లో బీసీ వర్గాల రిజర్వేషన్లను 40 శాతానికి పెంచేలా నిర్ణయం తీసుకున్నారు. ఇదే అంశాన్ని పార్టీ ఎన్నికల హామీ ప్రకటనలోనూ చేరుస్తారని చెబుతున్నారు. కర్ణాటక తరహాలోనే జనాభా ప్రాతిపదికన టికెట్ల కేటాయింపులు జరుగుతాయని చెబుతున్నారు. ఈసారి ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలన్న అంశం ప్రధాన అంశంగా మారుతుందని అంచనా వేస్తున్నారు. గడిచిన రెండు దఫాల్లో కేసీఆర్ సర్కారు చేసిన భారీ అప్పుల్ని ప్రధానంగా ప్రచారం చేయటంతో పాటు.. ప్రజల్లోకి పెద్ద ఎత్తున వెళ్లేలా ప్లాన్ చేస్తున్నట్లు చెబుతున్నారు. అంతేకాదు.. తెలంగాణ సెంటిమెంట్ ను కూడా వినియోగించుకోవలని భావిస్తున్నారు. లోక్ సభలో తెలంగాణ బిల్లును ఆమోదం పొందిన రోజున జరిగిన నాటకీయ పరిణామాలు.. ఆ రోజున కాంగ్రెస్ ఎంపీల పాత్ర.. బీఆర్ఎస్ ఏమీ చేయని వైనాన్ని తెలిపే వీడియోలను రూపొందించి.. గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్న యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ప్రస్తుతం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో సాగుతున్న విషయం తెలిసిందే. ఒకట్రెండు రోజుల్లో ఆ జిల్లా నుంచి నల్గొండ జిల్లాలోకి ప్రవేశించనున్న నేపథ్యంలో.. నల్గొండ జిల్లాలో భట్టి పాదయాత్ర సాగే సమయంలో నల్గొండ.. సూర్యపేట రెండుచోట్ల భారీ సభల్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. అంతేకాదు ఈ నెల 20-25 మధ్య ఖమ్మంలో భారీ సభను నిర్వహించాలని.. దీనికి ప్రియాంక గాంధీని ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే ఆమె నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేయటంతో ఆ దిశగా ఏర్పాట్లను చేస్తున్నారు.

# సంపాదకీయం

## అమెరికా సీక్రెట్ వెపన్.. హెల్ ఫైర్ ఆర్9ఎక్స్ స్పెషల్ ఏంది?

ప్రపంచ వ్యాప్తంగా మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టుగా పేరుతో పాటు.. వందల కోట్ల రూపాయిల పారితోషికం అతడి తలకు కట్టిన అగ్రరాజ్యం.. ఎట్టకేలకు తాను అనుకున్నట్లే అతడ్ని లేపేసింది. అయితే.. ఈ సందర్భంగాఅమెరికా వాడిన ఆయుధం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. ఎలాంటి పేలుడు చోటు చేసుకోకుండా.. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులకు ఎలాంటి హాని కలిగించకుండా.. తమ టార్గెట్ అయిన జవహరీని మట్టుపెట్టిన చాక చక్యం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా చర్చకు తెర తీసింది. ఈ అత్యాధునిక క్షిపణిని హెల్ ఫైర్ ఆర్9ఎక్స్ గా చెబుతున్నారు. అగ్రరాజ్యం సీక్రెట్ వెపెన్ గా దీన్ని చెబుతున్నారు. ఇంతకీ ఈ అత్యాధునిక ఆయుధం కతేంటి? దాని విశేషాలేమిటి? అన్నది చూస్తే.. ఎవరినైనా టార్గెట్ చేసి.. చుట్టుపక్కల వారికి ఎలాంటి హాని కలిగించకుండా ఉండేందుకు సంధించే క్షిపణిగా దీన్ని చెబుతారు. ఈ క్షిపణికి మూలం ఏజీఎం 114 హెల్ ఫైర్. ఇది లేజర్ గైడెడ్ క్షిపణి. ఆకాశం నుంచి భూమి మీదకు దీన్ని ప్రయోగిస్తారు. ధ్వని కంటే తక్కువ వేగంతో ప్రయాణించే ఈ క్షిపణికి సంబంధించి అనేక వేరియంట్లు ఉన్నాయి. వాటిల్లో ఒకటి "హెల్ ఫైర్ ఆర్9ఎక్స్". దీని ప్రత్యేకత ఏమంటే.. పరిసరాలకు పెద్దగా నష్టం వాటిల్లకుండా చేయటం.. టార్గెట్ చేసిన వ్యక్తులను మాత్రమే ఏసేస్తుంది. ఈ క్షిపణి వ్యవస్థను ఒబామా హయాంలో డెవలప్ చేశారు. కరుడుగట్టిన ఉగ్రనాయకుల్ని ఎలాంటి సిబ్బంది అవసరం లేకుండానే ఈ క్షిపణి సాయంతో హతమారుస్తారు. ఉగ్ర నేతల్ని ఏసేసుందుకు ఈ తరహా క్షిపణులను అమెరికా ప్రయోగిస్తోంది. తమ వద్ద ఉన్న ఆయుధాల్లో కొన్నింటి గురించి చెప్పినా.. హెల్ ఫైర్ ఆర్9 ఎక్స్ ఉన్న విషయాన్ని మాత్రం అగ్రరాజ్యం రివీల్ చేయలేదు. 2017లో తొలిసారి ఈ క్షిపణి కనిపించింది. సిరియాలో అల్ ఖైదా సీనియర్ నేత అబూ అల్ ఖయిర్ అల్ మస్రి ప్రయాణిస్తున్న కారు మీదకు దీన్ని ప్రయోగించారు. ఆ సందర్భంలో ఈ క్షిపణి తీవ్రతకు కారు మీద పెద్ద రంధ్రం పడినట్లుగా చెబుతారు. దీని ప్రభావానికి అల్ మస్రీ తో పాటు కారులో ఉన్న వారంతా నుజ్జునుజ్జు అయ్యారని చెబుతారు. కానీ.. కారు ముందు భాగం.. వెనుక భాగం మాత్రం దెబ్బ తినకపోవటం చూస్తే.. ఈ అత్యాధునిక క్షిపణి.. ఎంతటి శక్తివంతమైనదో ఇట్టే చెప్పొచ్చు. అలా ప్రపంచానికి తనదగ్గర ఉన్న సరికొత్త క్షిపణి వ్యవస్థ గురించి ప్రపంచానికి తెలిసింది. ఆ తర్వాత కాలంలోనూ వీటిని వాడినా.. అవన్నీ ప్రత్యేక సందర్భాలేనని చెబుతారు. దాదాపు ఐదు అడుగులు.. 45 కేజీల బరువుతో ఉండే ఈ క్షిపణిని డ్రోన్లు.. హెలికాప్టర్లు.. విమానాలు.. హమ్వీ వాహనాలతో ప్రయోగించే వీలుంది. 500 మీటర్ల నుంచి 11 కిలోమీటర్ల రేంజ్ వరకు దీన్ని ప్రయోగించే వీలుంది. హెల్ ఫైర్ ఆర్9ఎక్స్ క్షిపణిలో వార్ హెడ్ ఏమీ ఉండదు.కానీ.. క్షిపణి ముందు భాగంలో పదునైన కత్తులు లాంటి బ్లేడ్లు ఉంటాయి. లక్ష్యం సమీపానికి వెళ్లగానే.. ఈ బేడ్లు విచ్చుకొని ఒక్కసారిగా లక్షిత వ్యక్తుల్ని టార్గెట్ చేసి.. శరీరాన్ని ఛిద్రం చేసేస్తాయి. తద్వారా తాము అనుకుంటున్న పనిని పూర్తి చేస్తాయి.

## ప్లాస్టిక్ నిషేధం.. నామమాత్రం



పెద్దపల్లి : పర్యావరణానికి హాని కలిగిస్తున్న పాలిథీన్ కవర్ల వినియోగంపై ప్రభుత్వం విధించిన నిషేధం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు జరిగే తనిఖీల నుంచి తప్పించుకుంటూ కవర్లను విక్రయించే వ్యాపారులతో పాటు కనీసం సామాజిక బాధ్యత లేకుండా విచ్చలవిడిగా వినియోగించడంతో పరిసరాల్లో ప్లాస్టిక్ కవర్లు గుట్టలుగా పేరుకుంటున్నాయి. మురుగు కాలువలోని చెత్తలో సగానికి పైగా ప్లాస్టిక్ కవర్లే ఉంటున్నాయి. చిన్న కిరాణ దుకాణాల నుంచి షాపింగ్ మాల్స్ వరకు టిఫిన్ సెంటర్ నుంచి రెస్టారెంట్ వరకు ఆహార పదార్థాల ప్యాకింగ్‌కు చాలావరకు పాలిథీన్ కవర్లనే వినియోగిస్తున్నారు. చివరికి భోజనాలు చేసేందుకు వినియోగించే పేపర్ ప్లేట్లపై సైతం పాలిథీన్ పొర ఉంటోంది.

టన్నుల కొద్దీ వినియోగం

ప్లాస్టిక్ వినియోగంతో మానవ జీవనానికి విడదీయరాని బంధం ఏర్పడింది. నిబంధనల కంటే తక్కువ మందం కలిగిన పాలిథీన్ కవర్లు అందుబాటులోకి రావడంతో వాటి వినియోగం టన్నులకొద్ది పెరిగిపోయింది. కిరాణ దుకాణాలు, కూరగాయల మార్కెట్లు కవర్ల వినియోగానికి కేంద్రాలుగా మారాయి. సంచుల వినియోగంపై ఎంతటి ప్రచారం చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. టిఫిన్ సెంటర్లు, హోటళ్లలో ఆహార పదార్థాల ప్యాకింగ్‌లో పాలిథీన్ కవర్లే కీలకంగా మారాయి. కూరలు, సాంబరుతో పాటు చివరికి చాయ్‌ని సైతం కవర్లలో పార్సిల్ చేస్తున్నారు. వేడిపదార్థాలకు కవర్లను వినియోగించడం ప్రమాదకరమని తెలిసినా వినియోగం అనివార్యమవుతోంది. ఈవిధంగా ఒకసారి వాడి పడేసిన కవర్లను ఏరివేసేందుకు మున్సిపాలిటీ సిబ్బందికి కష్టాలు తప్పడం లేదు. ఈ క్రమంలో పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ కవర్ల ఏరివేత కార్యక్రమాన్ని గతంలో నిర్వహించారు. కేవలం వారం రోజుల వ్యవధిలో 130 మెట్రిక్ టన్నుల కవర్లు లభించాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థంచేసుకోవచ్చు కవర్లను వాడి పారేయడంతో మురుగు కాలువల్లోకి చేరి నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడుతోంది.

చిరు వ్యాపారులే సమిధలు

ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల నియంత్రణకు మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు చేపడుతున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ప్రజలు అనివార్యంగా వినియోగిస్తుండడంతో వ్యాపారులు వాటిని అమ్ముతున్నారు. ఈక్రమంలో వ్యాపారుల గోదాములను తనిఖీ చేసిన అధికారులు వ్యాపారులకు జరిమానాలు వేసి వదిలేస్తున్నారు. ద్విచక్రవాహనంపై పాలిథీన్ కవర్లు విక్రయించుకునే చిన్న వ్యాపారిపై పెద్దపల్లి మున్సిపల్ అధికారులు ఒకే నెలలో పలుపర్యాయాలు కేసులు నమోదు చేశారు. సదరు వ్యాపారిపై రూ.లక్షల్లో జరిమానాలు విధించడంతో చివరికి సదరు చిన్న వ్యాపారి కవర్ల అమ్మకాన్ని వదిలేశాడు. కేవలం ఉపాధి కోసం చేపట్టిన కవర్ల విక్రయం ఉపాధినే ప్రశ్నార్థకం చేస్తోందని పలువురు వాపోతున్నారు. కాగా అధికారులు మాత్రం

కవర్ల తయారీ, రవాణాను నియంత్రించలేక పోతున్నారని పలువురు అంటున్నారు. చిన్నతరహా నుంచి భారీ పరిశ్రమ స్థాయికి ఎదిగిన కవర్ల తయారీని నియంత్రించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌లోని మేడ్చల్, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇలాంటి కవర్ల తయారీ పరిశ్రమలు పదుల సంఖ్యలో ఉన్నాయి. 100 మైక్రాన్లకంటే తక్కువ మందం కలిగిన కవర్ల తయారీని నేటికీ నిలువరించలేకపోతున్నారు.

పౌరస్పృహతోనే ఫలితం

ఇంటి నుంచి సరకులు తీసుకురావడానికి మార్కెట్‌కు వెళ్లే ప్రతి ఒక్కరు సంచులను వెంట తీసుకువెళ్లడం, ఆహారపదార్థాలను కవర్లలో కాకుండా, అరటి ఆకులు, పేపర్ కవర్లలో, టిఫిన్ బాక్సుల్లో మాత్రమే తీసుకోవాలి. కవర్లలో ప్యాకింగ్ చేసే ప్రాంతంలో పార్సిళ్లను తిరస్కరించడం అలవాటు చేసుకుంటే కొంతైనా పర్యావరణానికి మేలు చేసిన వాళ్లమవుతాము. పాలిథీన్ కవర్లు పైపొర కలిగిన పేపర్ గ్లాసులు, ప్లేట్లను వాడకూడదనే నిబంధన స్వయంగా విధించుకోవాలి. ఇక పెళ్లిళ్లు, ఇతర వేడుకల్లో ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు వాడకుండా ఎవరికి వారే నిర్ణయం తీసుకుంటే వీటిని విక్రయించే వారు తగ్గిపోతారు. ప్రజల వాడకాన్ని బట్టి వస్తువులను విక్రయించే సంస్కృతి పెరుగుతుంది. వీటిని కట్టడి చేసేందుకు పురపాలిక అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. గత వారం రోజల వ్యవధిలో పెద్దపల్లి పురపాలికలో రూ.70వేల వరకు జరిమానా విధించారు. ఇప్పటికైనా వస్త్రం సంచుల వినియోగంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సి ఉంది.

## ఆధునికీకరణపై పట్టింపేది?



కరీంనగర్ : పట్టణ శివారులోని కంచరకుంట మాటు కాలువకు ఏటా గండి పడటంతో కాలనీలు జలమయమవుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. ఏఖీన్‌పూర్ స్తంభాల చెరువు తూం నుంచి పట్టణ శివారులోని కంచరకుంట చెరువు నింపేందుకు 2.4 కి.మీ పొడవున గొలుసుకట్టు మాటు కాలువ ఉంది. కాలువ చాలా ఏళ్ల క్రితం నిర్మించింది కావడంతో అందులో చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి నీళ్లు ముందుకు సాగడం కష్టంగా మారింది. మాటు కాలువ మధ్యలో 2 మీటర్ల విస్తీర్ణంతో నీరు ముందుకు పారుతుంటుంది. కాలువ మధ్యలోంచి ఇరువైపులా 33 ఫీట్ల వరకు భూమి ఉంటుంది. కాలువను ఆనుకుని ఉన్న భూయజమానులు గట్టు వరకు చదును చేసి సాగు చేయడంతో రోజురోజుకు కుచించుకుపోయి ప్రమాదకరంగా మారింది.

జలమయమవుతున్న కాలనీలు

అల్లమయ్యగుట్ట కింది ప్రాంతంలో కాలువను ఆనుకుని నాలుగేళ్ల క్రితం కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల నుంచి భూమిని కొనుగోలు చేశారు. సుమారు 8 మీటర్లకుపైగా వెడల్పు గల కాలువను ధ్వంసం చేసి రెండు మీటర్లకు కుచించారు. రైతుల ఫిర్యాదు మేరకు అప్పటి తహసీల్దార్ రియల్ ఎస్టేట్ వ్యాపారులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తర్వాత వారు నామమాత్రంగా మట్టితో కాలువ కట్టను నిర్మించి వదిలేశారు. కాలువ నాణ్యత దెబ్బతినడంతో రెండేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు గండిపడుతుంది. గతేడాది కాలువలో చెరువు నీటిని విడుదల చేయడంతో గండిపడి బీలాల్‌పుర, రాంనగర్‌లో, వేములవాడ రహదారిని నీట ముంచింది. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేములవాడరోడ్‌పై రోజంతా రాకపోకలు నిలిచిపోయాయి. కాలువకు గండిపడ్డచోట మట్టిపోసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కేవలం వర్షపు నీటికే కాలువ మరోమారు కోతకు గురై బీలాల్‌పుర, వేములవాడరోడ్‌పైకి నీరు పోటెత్తింది. దీంతో కాలువలో చెరువు నీటిని విడుదల చేయకుండా నిలిపివేశారు.

రూ.20 లక్షలతో ప్రతిపాదనలు

కంచరకుంట మాటు కాలువకు తరచూ గండిపడి పట్టణంలో వరదలు సృష్టిస్తున్నా నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏసుకోనిగుట్ట కాలనీకి వెళ్లే మార్గంలో కాలువలో పైపులు వేశారు. కాలువలో పారుతున్న నీరు పైపులోంచి వెళ్లే వీలు లేకపోవడంతో కాలువపై నుంచి పారుతూ కింది ప్రాంతాలను వరద ముంచెత్తుతుంది. కాలువలో వేసిన పైపుల వద్ద పెద్దఎత్తున మురుగు నిలిచి కుంటలా తయారై పందులు, దోమలకు నిలయంగా మారింది. మున్సిపల్ అధికారులు కాలువపై వంతెన నిర్మించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలువ ఆధునికీకరణ విషయమై ఏఈ వెంకటేష్‌ను సంప్రదించగా కాలువలో పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కల తొలగింపు, కాలువ మరమ్మతులు, పూడీకతీత పనుల కోసం రూ.20 లక్షలతో అంచనాలను రూపొందించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే ఆధునికీకరణ పనులు చేపడతామని పేర్కొన్నారు.

## పర్యాటక కేంద్రంగా మారేనా?

మల్లాపూర్ : 'ప్రకృతి రమణీయతతో అలరాడుతున్న శ్రీకనక సోమేశ్వరకొండను పర్యాటకప్రాంతంగా గుర్తించడంతో పాటు కొండపైకి ఘాట్‌రోడ్డును నిర్మిస్తామన్న నేతల హామీ నేటికి కార్యరూపం దాల్చడం లేదు. ఏటా కొండపై కొలువైన స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఇక్కట్లు తప్పడంలేదు. పాటు శివరాత్రి, శ్రావణమాసాల్లో వేలాదిగా వస్తున్న భక్తులు మెట్లమార్గంలో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.'

రాజగోపురం నిర్మాణంపై నీలినీడలుసోమేశ్వరకొండకు భక్తుల విరాళాలతోనే కొండ కింద నుంచి పైవరకు దాదాపు 854 మెట్లను నిర్మించారు. భక్తులు తాము మొక్కుకున్న మొక్కులు నెరవేరడంతో వాటిని నిర్మించారు. కొండపై గర్భగుడి చుట్టూ మహా మండపంను సైతం భక్తుల కానుకలతో దాదాపు రూ.80 లక్షలతో ఐదు సంవత్సరాల కాలంలో పూర్తిచేశారు. కొండ ముందు భాగంలో రాజగోపురం పనులు మాత్రం భక్తుల విరాళాలు అందకపోవడంతో నిలిచిపోయాయి. ప్రభుత్వం స్పందించి రాజగోపురంను సైతం నిర్మిస్తే ఈ ప్రాంతం ఆధ్యాత్మిక సోగసులు అద్దుకోనుంది.

ఘాట్‌రోడ్డు, రోప్‌వేల నిర్మాణాలుసోమేశ్వరకొండకు ఘాట్‌రోడ్డుతో పాటు రోప్‌వేల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేస్తే వాహనాల రాకపోకలు పెరిగి మరింత మంది కొండకు వచ్చే అవకాశం ఉంది. ఇంతటి ప్రాముఖ్యతను తెలిపే ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

## రక్తహీనతపై పోరు.. ఆరోగ్య పరీక్షల జోరు

కరీంనగర్ : మహిళల్లో సాధారణంగా కనిపించే సమస్య రక్తహీనత. చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకూ అందరూ ఏదో ఒక విధంగా దీనికి బాధితులైన వారే. సమస్యపై అవగాహన లేక ఏళ్ల తరబడి ఇబ్బందిని భరిస్తున్నారు. మహిళలను ఈ రుగ్మత నుంచి కాపాడాలనే ఉద్దేశంతో జిల్లాలో వైద్యారోగ్యశాఖ కసరత్తు చేస్తోంది. కలెక్టర్ సూచనల మేరకు నెల రోజులుగా క్షేత్రస్థాయి పరీక్షలతో సరికొత్త ఉద్యమాన్ని ప్రారంభించింది. డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ లేని విధంగా 'అనీమియా ముక్త్' నినాదంతో ముందుకు వెళ్తున్న ఈ కార్యక్రమం విశేషాలపై కథనం.

ఏం చేస్తున్నారు ?

కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న 15 నుంచి 45 వయసు గల వారికి రక్త పరీక్షలు నిర్వహిస్తారు. హిమోగ్లోబిన్ 8 శాతం కంటే తక్కువ ఉన్న వారిని గుర్తిస్తారు. పోషకాహారాలు తినాల్సిందిగా సిఫార్సు చేస్తారు. రక్తం 7 శాతం కన్నా తక్కువ ఉన్నవారికి అవసరమైనవైద్య సలహాలతో చికిత్సను అందిస్తారు. ప్రభుత్వాస్పత్రిలో దీనికి కావాల్సిన మందులన్ని అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఐరన్ ఇంజెక్షన్లు, మాత్రలు అవసరానికి సరిపడా ఉండేలా చూస్తున్నారు. అవసరాన్ని బట్టి వీటిని సంబంధిత రుగ్మతతో బాధపడేవారికి ఇస్తున్నారు.

కార్యాచరణ ఇలా..

ఈ కార్యక్రమం మొదలుపెట్టి నెల రోజులు గడిచింది. ఇప్పటికి లక్షకు పైగా మందికి పరీక్షలు పూర్తిచేశారు. వారిలో 1100 మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారందరికి చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. సమీపంలో ఉన్న వైద్యులకు ఈ కేసులు అప్పగిస్తున్నారు. ఇప్పటి వరకు నమోదైన కేసుల్లో 30 సంవత్సరాల వయసులో ఉన్న వారే అధికంగా రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

ఆరోగ్యమే స్ఫూర్తిగా..

ఆరోగ్య పరిరక్షణలో భాగంగా భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకుని ఇలా గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల్లోనూ వైద్య సిబ్బంది తమ చేయూతను అందిస్తున్నారు. దీని వల్ల ముమ్ముందు ఉపయోగాలు ఉంటాయని చెబుతున్నారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్న తరువాత కార్యక్రమాన్ని విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామంటున్నారు. నిరంతర ప్రక్రియలా దీనిని చేపట్టాలని భావిస్తున్నారు. చిన్న వయసులోనే ఈ సమస్యను గుర్తించడం వల్ల గర్భిణుల్లో ప్రసవ సమయంలో వచ్చే సమస్యలు పరిష్కరించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. నెలసరి సమయంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించవచ్చని చెబుతున్నారు. మొదట ఉత్తర తెలంగాణలో కరీంనగర్‌ను రక్తహీనత లేని పట్టణంగా తీర్చిదిద్ది .. తరువాత అన్ని జిల్లాలకు ఇక్కడి ప్రయోగ విజయాన్ని అందించాలని జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. ఇక్కడ అమల్లో ఉన్న కార్యక్రమాలతో అన్ని జిల్లాలకు మార్గదర్శకంగా నిలిచేలా ప్రయత్నిస్తున్నారు.

2.20 లక్షల మంది లక్ష్యంగా...

క్షేత్రస్థాయి సిబ్బంది సహకారంతో ఈ ఏడాది ఆగస్టు 15 లోపు 2.20 లక్షల మందికి పరీక్షలు నిర్వహించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. నిరంతరం వారి కేసులను అనుశీలన చేసి రక్త శాతం పెరుగుతున్నది లేనిది పరిశీలిస్తారు. దీనికి ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పునాదిగా పనిచేస్తూ తోడ్పాటునిస్తున్నారు. ప్రతి ఒక్క మహిళ వివరాలను సిబ్బందికి ఇచ్చిన చరవాణి యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. దీని వల్ల ఎప్పటికప్పుడు వ్యాధి బాధితులను గుర్తించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ పరీక్షలు చేయడానికి ఆశాకార్యకర్తలకు అందించిన కిట్టు ఒకటి రూ.2 వేల విలువ చేసేది. ఒక కిట్టుతో 500 మందికి పరీక్షలు నిర్వహించవచ్చు.

## దోమలకు పొగ.. ఆదాయానికి సెగ

కరీంనగర్ : దోమలు పగలు, రాత్రనక కుడుతున్నాయి.. మున్సిపాలిటీ వాళ్లు పట్టించుకోవడం లేదు.. మందు చల్లడం తప్ప.ఫాగింగ్‌తో పొగ పెట్టడం లేదనే వాదన ఎక్కువగా ప్రజల్లోంచి వినిపిస్తోంది. నియంత్రణకు ఫాగింగ్ చేస్తే అవి పోతాయనే గ్యారెంటీ అయితే లేదు కాని.. బల్దియాకు పొగ పెట్టడం భారంగా మారింది.కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు పలు మున్సిపాలిటీల్లో దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేస్తున్నారు. చిన్న పట్టణాల్లో ఒకటెండ్రు ఉండగా నగరపాలికలో మాత్రం నగర విస్తీర్ణం బట్టీ వీటి సంఖ్య పెరిగింది. గతంలో రెండు ఉండగా ఆ తర్వాత వీటి సంఖ్య నాలుగు మిషన్లకు చేరింది. ఇటీవల చేతి ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. కొనుగోలు చేయడం ఎంత సులువుగా ఉంటుందో.. దీని నిర్వహణ చూసి పాలకవర్గ సభ్యులు, అధికారులు నివ్వెర పోతున్నారు. దోమలు పారిపోవాలంటే పొగ రావాలి. కృత్రిమంగా తయారు చేయాలంటే డీజిల్, పెట్రోల్ పోయాల్సిందే.

ఫాగింగ్ డిమాండ్ అధికం

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సాధారణం అయినా.. నీరంతా ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉండటంతో లార్వా పెరిగి దోమల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇంటి లోపలి పరిసరాలు శుభ్రం చేసుకోకపోవడంతో కొన్ని ఇళ్లు భయంకరంగా ఉన్నాయి. కనీసం నీటిని పడేయాలనే ఆలోచన కూడా చేయడం లేదు. ఇంటి చుట్టే దోమలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నారు. ఫాగింగ్ చేయాలనే డిమాండ్ అధికమైంది.

రోజుకు రూ.లక్షకు పైగా..

ఒకటి, రెండు లీటర్లు కాదు.. చేతి ఫాగింగ్ మిషన్ పని చేయాలన్నా..గంటపాటు వీధుల్లో తిరగాలంటే 40లీటర్ల డీజిల్ తప్పనిసరి. ట్రక్కు మిషన్‌ను 3గంటలు తిప్పితే 200 లీటర్లు, ఆటో మిషన్ తిప్పితే రెండు గంటలకు వంద లీటర్లు డీజిల్ వాడుతున్నారు. ఈ లెక్కన రోజుకు 30 డివిజన్ల పరిధిలో ఫాగింగ్ చేయాలంటే రోజుకు 1200లీటర్ల డీజిల్ అవసరం కాగా దీనికోసం నగరపాలక సంస్థ ప్రతిరోజు రూ.1,17,468 మేర ఖర్చు పెట్టాల్సిందే. నెలకు రూ.29,36,700, మూడు నెలలు ఇలాగే వాడితే మొత్తం 19 యంత్రాలకు కలిపి సుమారు రూ.1.54 కోట్ల భారం బల్దియాపై పడుతుంది.

వేగంగా తిప్పుతూ..నగరపాలక పరిధిలో ఫాగింగ్ నిర్వహణకు డీజిల్ వినియోగం తడిసి మోపడవుతుండటంతో పారిశుద్ధ్య విభాగం సిబ్బంది డీజిల్ తగ్గించడం కోసం వాహన వేగాన్ని పెంచి తిప్పుతున్నారు. కొద్ది గంటల్లోనే ఆయా ప్రాంతాలను తిరిగి వచ్చి నిలిపి వేస్తుండటంతో కొంతమేర డీజిల్ ఆదా చేస్తున్నట్లుగా చెబుతున్నారు. గంటకు 40లీటర్లు డీజిల్ అవసరముంటుందని ఇటీవల కొత్తగా ఫాగింగ్ మిషన్ల ప్రారంభోత్సవం సందర్భంలో ప్రస్తావనకు రాగా ఎక్కడైతే వ్యాధులు, ఫిర్యాదులు ఉంటాయే అక్కడే వీటిని తిప్పాలని పేర్కొనడం గమనార్హం.గంటకు 40లీటర్ల డీజిల్: నగరపాలికలో వినియోగిస్తున్న చేతి ఫాగింగ్ మిషన్ ఇది. సాయంత్రం పూట చిన్న, చిన్న వీధుల్లోకి వాడటం కోసం ఉపయోగిస్తుండగా గంటకు డీజిల్ 40లీటర్లు పోయాల్సి ఉంటుంది. దీంతో పాటు నాలుగున్నర లీటర్ల పెట్రోల్ మండేందుకు వాడుతారు. అప్పుడే దట్టమైన పొగ వచ్చి దోమలు పారిపోతాయి. 3గంటలకు 200 లీటర్లు: ట్రంకు మౌంటెడ్ ఫాగింగ్ మిషన్‌గా పిలుస్తుండగా రహదారుల వెంబడి ఫాగింగ్ చేసేందుకు దీనిని ఎక్కువగా వాడుతారు. మూడు గంటలు తిరగాలంటే 200 లీటర్లు డీజిల్ పోయాల్సిందే. దీంతో పాటు అదనంగా పెట్రోల్ తప్పనిసరిగా వాడాలి.

# గత సమస్యలు పునరావృతం కావొద్దు..!

మహబూబాబాద్: యాసంగి వరి కోతలు ముమ్మరమయ్యాయి.. చేతికొచ్చిన ధాన్యం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలకు చేరుతోంది. జిల్లా వ్యాప్తంగా 234 కేంద్రాలను ఏర్పాటు చేసి 1.80 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పౌరసరఫరాలశాఖ సిద్ధమైంది. తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో కేంద్రాలను ప్రారంభించింది. మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్-ఏ రకానికి రూ. 2060, సాధారణం రూ.2040గా నిర్ణయించారు. గత వానాకాలంలో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా చినిగిన గన్నీ సంచులతో అవస్థలు పడ్డారు. నిబంధనల ప్రకారం తూకం వేయాల్సిన నిర్వాహకులు తాలు, తేమ సాకుతో అధిక తూకం వేస్తూ నష్టపరిచారు. సకాలంలో ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో ఈ యాసంగి కొనుగోళ్లలో గత సమస్యలు పునరావృతం సాఫీగా కొనుగోలు చేయాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

తూకం సజావుగా వేయాలి

గత వానాకాలంలో మహబూబాబాద్ మండలం ముదుపుగల్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అదనంగా తూకం వేశారు. నిబంధనల ప్రకారం ఒక్కో బస్తాను 40.700 కిలోల చొప్పున తూకం వేయాలి. కాని పలు కేంద్రాల్లోని నిర్వాహకులు మిల్లర్ల పేరు చెబుతూ కిలో అదనంగా తూకం వేశారని రైతులు ఆరోపించారు.



కేసముద్రం మండలం అన్నారంలో ఒక్కో బస్తా 4 కిలోలు ఎక్కువ బరువు వచ్చేలా నిర్వాహకులు ప్రైవేటు మెకానిక్‌తో బరువు తూచే యంత్రంలో మార్పు చేయించారు. ఒక రైతుకు వచ్చిన అనుమానంతో బహిర్గతమైంది. ఈసారి అలాంటివి జరగకుండా నిబంధనల ప్రకారం తూకం జరిగేలా చూడాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రవాణా కష్టాలు రానివ్వొద్దు

అన్నదాతలకు ప్రతిసారి రవాణా కష్టాలు ఎదురవుతున్నాయి. సకాలంలో లారీలు రాకపోవడంతో కేంద్రాల వద్దనే తూకం వేసిన బస్తాల నిల్వలు పేరుకుపోతుండడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. చివరకు రైతులే అద్దెకు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని బస్తాలను మిల్లులకు తరలించిన ఘటనలుంటున్నాయి. ఈసారి ఆ కష్టాలు రాకుండా అధికారులు ముందస్తుగానే ట్రాన్స్‌ఫోర్టు గుత్తేదారులతో మాట్లాడి లారీలు అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మంచి సంచులు వచ్చేనా..? జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు 45 లక్షల గోనె సంచులు అవసరముండగా ప్రస్తుతం 27 లక్షలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కొత్తవి 12 లక్షలు, పాతవి 15 లక్షలున్నాయి. గత వానాకాలంలో నెల్లికుదురు పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొనుగోలు కేంద్రంలోని గన్నీ సంచుల్లో అధికంగా చిల్లులు పడినవే ఉన్నాయి. 50 సంచుల కట్టలో 10 నుంచి 15 వరకు చిల్లులు పడినవే వచ్చాయని అన్నదాతలు వాపోయారు. సంచులతో పీఏసీఎస్ అధికారులకు కష్టాలు తప్పడం లేదు. ఒక్కో కట్టలో 50 చొప్పున ఉంటాయని లెక్కించి ఇచ్చినా అందులో 5 నుంచి 6 తక్కువగా వస్తాయని.. 10 వరకు చిరిగినవి ఉంటాయని ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ యాసంగిలో అలాంటి సమస్య తలెత్తకుండా మంచి సంచులను అందించాలని రైతులు కోరుతున్నారు.

# ప్రారంభం కాని కేంద్రాలు.. ధాన్యం దళారులపాలు

గంగాధర : యాసంగిలో తెగుళ్లు, చీడపీడలతో పెట్టుబడి రెట్టింపు అయింది. మధ్యలో సాగునీటి కొరత, వడగళ్ల వానలతో పంటలకు నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందలేదు. ఎకరాకు 20 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. వీటన్నింటికి తోడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు ధాన్యానికి రూ.2,060 కాగా దళారులు రూ.1600 చెల్లించి కొంటున్నారు. ఇక సంచికి 2 కిలోల ధాన్యం కోత, కాంటా తూకంలో మోసాలు అదనం. ఇవీ ప్రస్తుతం రైతుల దయనీయ పరిస్థితి.

భారీగా తగ్గిన దిగుబడులు జిల్లాలో ఈసారి గతం కన్నా 2,46,893 ఎకరాల్లో ఎక్కువ వరి పంటను సాగు చేశారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడులు వెచ్చించారు. వడగళ్ల వానలతో 13,377 ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. దీనికితోడు మొగిపురుగు ఉద్ధృతితో వరికంకులు ఊస తిరిగి పంటకు నష్టం వాటిల్లింది. నాలుగైదుసార్లు పురుగు మందులు చల్లినా తెగుళ్ల నివారణ సాధ్యం కాలేదు. అగ్గితెగులు, మెడవిరుపు, పంట కోత సమయంలో దోమపోటుతో పంట ఉత్పత్తిలో నాణ్యత తగ్గింది. యాసంగిలో ఎకరాకు 30 క్వింటాళ్ల పైబడి దిగుబడులు రావాల్సి ఉండగా ఈసారి 20 క్వింటాళ్లలోపు మాత్రమే వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించడం వల్ల క్వింటాలుకు రూ.1,600 ధర చెల్లిస్తుండగా ఎకరాకు 18 క్వింటాళ్ల చొప్పున రూ.28,800 వేలు రైతుకు దక్కుతుంది. పెట్టుబడి రూ.25 వేలు పోనూ మిగిలేది కేవలం 3,300లే అని, వ్యవ'సాయం'పైనే ఆధారపడితే ఇక ఓదార్పు ఎక్కడిదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఊరంతా ప్రైవేటుకే..గంగాధర మండలంలోని పోతుగంటిపల్లికి చెందిన రైతులు ముందుగానే వరిపంట సాగు చేసి కోతలు పూర్తి చేశారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటులో జాప్యం, బ్యాంకు ఖాతాలో డబ్బులు జమయ్యేంతవరకు గతంలో అనుభవించిన కష్టాలను గుర్తు చేసుకుంటున్న రైతులు దళారులను ఆశ్రయించారు. ఇప్పటికే 12 లారీల్లో 1,550 క్వింటాళ్ల ధాన్యం ప్రైవేటు వ్యాపారులకు 12 మంది రైతులు అమ్ముకున్నారు. మిగిలిన 16 మంది రైతులు ప్రైవేటు వ్యాపారులనే ఆశ్రయించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, తెగుళ్లతో ధాన్యంలో నాణ్యత లేక తాలు రావడం, ప్రభుత్వ కేంద్రంలో కొర్రీలు ఇవన్నీ పడలేకే తక్కువ ధరకైనా అమ్ముకుంటున్నామని రైతులు తెలిపారు.

దిగుబడి తగ్గిందిరాజు, పోతుగంటిపల్లి

ప్రభుత్వ మద్దతు ధర రూ.2,060 ఉంది. ఈసారి మూడెకరాల్లో వరిపంట కోస్తే 80 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. గతంలో ప్రభుత్వ కేంద్రంలో ధాన్యం విక్రయిస్తే 28 బస్తాల ధాన్యం తరుగు తీసి నష్టపరిచారు. తప్పని పరిస్థితుల్లో నష్టమైనా అమ్ముకుంటున్నాం.కేంద్రాల ఏర్పాటులో జాప్యంఅంజిరెడ్డి

రెండెకరాల్లో వరిపంట వేస్తే వడగళ్ల వానలకు పంట దెబ్బతిని నష్టం జరిగింది. పంటంతా పోతేనే నష్టపరిహారం ఇస్తామని అధికారులు కొర్రీలు పెట్టారు. మొగిపురుగు, దోమపోటు, మెడవిరుపుతో ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. కొనుగోలు కేంద్రం ఏర్పాటు జాప్యంతో ప్రైవేటు వ్యాపారికే ధాన్యం విక్రయించాం.

# 'మిషన్ వాత్సల్య'కు ప్రచారం కరవు




వరంగల్ : జిల్లాలోని తల్లిదండ్రులను కోల్పోయిన, నిరాదరణకు గురైన, దీర్ఘకాలిక ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న, నిరాశ్రయులైన 18ఏళ్లలోపు అనాథ బాలలకు ఆర్థిక చేయూతనందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ పథకానికి రూపకల్పన చేశాయి. కేంద్ర శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా అభాగ్యులకు నెలకు రూ.4వేల చొప్పున అందిస్తారు. అయితే 2011 నుంచి గతేడాది వరకు రాష్ట్రంలో జిల్లాస్థాయిలోని అనాథలను గుర్తించి జిల్లా సంక్షేమ శాఖకు కేటాయించిన బడ్జెట్ అనుసారంగా 'సమగ్ర బాలల రక్షణ పథకం' అమలుచేసేవారు. తదనంతరం ఈ పథకమే మిషన్ వాత్సల్య పథకంగా అమలవుతోంది. అయితే ఈ పథకం గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో 2021-22ఏడాదికి జిల్లాలో కేవలం 35 మంది అనాథ చిన్నారులే లబ్ధిపొందారు. అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు వారికి నెలకు కేవలం రూ.వెయ్యి చొప్పున మంజూరుచేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పథకానికి విస్తృతమైన ప్రచారం లేకపోవడంతో అర్హులు నష్టపోతున్నారు. పూర్తిస్థాయిలో పథకం అమలుకు ప్రచారం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

అమలుకు మార్గదర్శకాలివే..

పథకాన్ని అమలుచేసేందుకు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించనున్నాయి. తద్వారా జిల్లాలోని సుమారు 128 మంది అనాథలు, 175మంది తల్లి లేదా తండ్రి లేని చిన్నారులకు లబ్ధి చేకూరనుంది. పథకానికి దరఖాస్తు చేసుకునే వారి సంరక్షకుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణాల్లో రూ.96 వేలకు మించకూడదు. ఎంపికైన చిన్నారులకు 18 ఏళ్లు నిండేవరకు పథకం వర్తిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు వసతిగృహాల్లో విద్యనభ్యసించే చిన్నారులను అనర్హులుగా గుర్తిస్తారు. వరుసగా 30 రోజులు పాఠశాలకు గైర్హాజరు అయినా నిలిపివేస్తారు. చిన్నారుల పూర్తి వివరాలు ఆధార్, తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రం, ఆదాయం, సంరక్షకులతో జాయింట్ అకౌంట్ తదితర వివరాలతో కూడిన పత్రాలను జతచేస్తూ దరఖాస్తు చేసుకోవాలి.

సమాచారం ఇవ్వడం లేదు...చిటికేషి పావని, ఎల్లంబజార్, వరంగల్

కొన్నేళ్ల క్రితం నాభర్త మృతి చెందారు. నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు ఇంటర్మీడియట్ రెండో ఏడాది. ఇంకొకరు పదో తరగతి చదువుతున్నారు. మిషన్ వాత్సల్య పథకం గురించి తెలిసిన వాళ్లు కొందరు నాకు చెప్పారు. పిల్లల చదువుకు, ఆర్థికంగా ఎంతో కొంత లబ్ధి చేకూరుతుందని పథకానికి దరఖాస్తు చేసేందుకు వారం నుంచి ప్రయత్నిస్తున్నాను. కానీ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడా సరైన సమాచారం ఇవ్వడంలేదు.

30లోపు దరఖాస్తు చేసుకోవాలి-ఎం.శారద, జిల్లా సంక్షేమశాఖ అధికారి

అభ్యర్థులు ఈనెల 30లోపు దగ్గర్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్న కమిటీ దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుంది. గతంలో అనాథలు, తల్లి లేదా తండ్రి లేని చిన్నారులకు రూ.2 వేలు చొప్పున అందించాం. ప్రస్తుతం ప్రభుత్వం పథకానికి కేటాయించే బడ్జెట్ మేరకు లబ్ధిదారులను ఎంపికచేసి ఆర్థిక సహాయం అందిస్తాం.

# ఏసీ బస్సుల్లో ఉక్కపోత!




వరంగల్ : వరంగల్ రీజియన్ నుంచి నడుస్తున్న ఏసీ బస్సులకు సరైనమరమ్మతులు, నిర్వహణ లేకపోవడంతో ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా తమ గోడును చెబుతుండగా.. చాలా మంది మౌనంగా భరిస్తున్నారు. ఏప్రిల్ రావడంతో భానుడి భగభగలు పెరిగిపోయాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. ఈ నేపథ్యంలో సుదూరాలకు ప్రయాణించే వారు డబ్బులు ఖర్చయినా ఫర్వాలేదుగానీ ప్రయాణం సుఖవంతంగా ఉండాలని కోరుకుంటున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఆర్టీసీ సైతం ఏసీ ట్రిప్పుల సంఖ్యను పెంచింది. వాటి నిర్వహణను మాత్రం పట్టించుకోవడం లేదు.

తరచూ మొరాయింపులు

ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో వరంగల్ 1, వరంగల్ 2 డిపోల పరిధిలో మాత్రమే ప్రస్తుతం ఏసీ బస్సులు నడుస్తున్నాయి. మొత్తం 47 ఉన్నాయి. ఏసీ రాజధానిలో హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు రూ.370, గరుడ బస్సుకు రూ.430, బెంగళూరు వెళ్లడానికి రూ.1250 ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని సెస్ పేరుతో అదనపు వసూలు చేస్తున్నారు. ఇందులో ప్రయాణించే వారికి వాటర్‌బాటిల్, ఏసీ ఎక్కువగా ఉన్నప్పుడు కప్పుకోవడానికి ఓ బెడ్ షీట్ ఇవ్వాలి. వినోదం కోసం టీవీలు ఏర్పాటు చేయాలి. ఇందులో ఎలాంటి అసౌకర్యాలు కలిగినా వెంటనే పరిష్కరించాలి.

మరికొన్ని ఇబ్బందులు

వెనక వైపు కూర్చున్న వారికి ఏసీ రావడంలేదు.

చాలావాటిలో చరవాణి ఛార్జింగ్ పెట్టుకునే పిన్ పనిచేయడంలేదు.

వాటర్ బాటిల్ డ్రైవర్ వద్ద ఉంటుంది. అవసరం ఉన్న వారే తెచ్చుకోవాలి. అడగని వారుంటే ఇక అంతే. అవి ప్రయాణికులకు ఇచ్చే వారు కూడా లేరు.

తరచూ మొరాయిస్తున్నాయి. గడిచిన వారం రోజుల్లో మూడు చోట్ల మూడు బస్సులను సాంకేతిక కారణాలతో మధ్యలో ఆపి ప్రయాణికులను ఇతర బస్సుల్లో పంపించారు.

సీట్ల ముందు భాగంలో వాటర్ బాటిల్ పెట్టుకునే బాస్కెట్లు దెబ్బతిన్నాయి.

ఇటీవల సిటీ వోల్వా బస్సులను రాజధానిగా మార్చి వాటిని దూర ప్రాంతాలకు నడిపిస్తున్నారు. ఈ బస్సుల్లో టీవీలు లేవు, సీట్లు సైతం పుష్‌బ్యాక్ కావడంలేదు. ఈ బస్సులు రీజియన్‌లో 14 వరకు ఉన్నాయి.

టీవీలూ రావడం లేదు

వినోదం కోసం ఏర్పాటు చేసిన టీవీలు మూగబోయాయి. మరికొన్నింటిలో మొరాయిస్తున్నాయి. కొన్నింటిలో రీసౌండ్ వచ్చి ప్రయాణికులకు అర్థంకాక చికాకు పుట్టిస్తున్నాయి. చక్కటి వినోదం, ఆహ్లాదం అందిస్తామని ఆర్టీసీతో ఒప్పందం చేసుకున్న గుత్తేదారులు నెలవారీగా వచ్చే కాసులపై చూపించే శ్రద్ధ ప్రయాణికుల సౌకర్యాలపై చూపించడంలేదు.

అధికారులు దృష్టి పెట్టాలి - పి.సతీష్, ప్రయాణికుడు

నేను ఇటీవల హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు ఏసీ రాజధాని బస్సులో ప్రయాణించా. అందులో టీవీ పని చేయడంలేదు. చరవాణి ఛార్జింగ్ పెట్టుకుందామంటే అదీ పని చేయలేదు. కొన్ని సీట్లు సైతం పుష్‌బ్యాక్ కావడంలేదు, వాటర్ బాటిల్ డ్రైవర్ వద్ద నుంచి తెచ్చుకోవాలి. అధికారులు వీటిపై దృష్టి సారించి సరిచేయాలి.

ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్విటర్ ఖాతాకు ఒక ప్రయాణికుడు చేసిన ట్వీట్ ఇది. తాను హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు తరచూ వెళ్లి వస్తుంటానని, రాజధాని బస్సులో ఏమాత్రం శుభ్రత లేదని.. ఏసీ పనిచేయడం లేదని.. ఆర్డినరీ బస్సులో ప్రయాణం చేసినట్టుగా ఉందని పేర్కొన్నారు. బస్సులో చెల్లాచెదురుగా పడి ఉన్న ప్లాస్టిక్ బాటిళ్ల ఫొటోలనూ ట్వీట్ చేశారు.

ఓ ప్రయాణికుడి ఆవేదన..ఇటీవల ఉప్పల్ నుంచి హనుమకొండకు బయలుదేరిన రాజధాని బస్సులో తరచూ ఏసీ మొరాయించింది. డ్రైవర్‌ను అడిగితే ఇది మామూలేనని.. బస్సు రన్నింగ్‌లో ఉన్నప్పుడే ఏసీ ఉంటుందని చెప్పారు. హైదరాబాద్ నుంచి రాజధాని బస్సులో ఇటీవల హనుమకొండకు వచ్చిన ఓ ప్రయాణికుడు తనకు కలిగిన అసౌకర్యాలను వివరిస్తూ స్థానిక స్టేషన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు.

# రెండో విడత గొర్రెల పంపిణీ షురూ

నల్గొండ : ప్రజల జీవనోపాధి పెంపొందించడం, వారి ఉపాధి కల్పనకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి యాదగిరి చెప్పారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న గొర్రెల పంపిణీ, కోడి పిల్లల యూనిట్ల పంపిణీ, పశువుల ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత తదితర అంశాలపై ఆయనతో ముఖాముఖి నిర్వహించింది. ఆ వివరాలిలా..రాయితీ గొర్రెలను తప్పుదోవ పట్టిస్తే చర్యలునల్గొండ జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభమైంది. జిల్లాలో 37,076 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం. మునుగోడు నియోజకవర్గంలో 4,800 మందికి గొర్రెలు అందించాల్సి ఉండగా 3,369 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశాం. వారిలో ఇప్పటికే 178 మందికి గొర్రెలను పంపిణీ చేశాం. మిగతా లబ్ధిదారులు కోరుకున్న చోటు నుంచి గొర్రెలను దిగుమతి చేసి పంపిణీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. అనంతపురం జిల్లా నుంచి ఎర్ర గొర్రెల సంతతిని లబ్ధిదారులు ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారు. బిల్లులు రాగానే గొర్రెలు చేతులు మారుతున్నాయనే విషయం మా దృష్టికి రాలేదు. కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పశువైద్యుల పర్యవేక్షణలోనే కొనుగోలుదారులు వారికి ఇష్టం వచ్చిన గొర్లను కొనుగోలు చేస్తున్నారు. మొదటి విడతలో పంపిణీ చేసిన గొర్రెలతో లబ్ధిదారులు చాలా వరకు ప్రయోజనం పొందుతున్నారు. ఎక్కడైనా రాయితీ గొర్రెలు చేతులు మారినట్లు తెలిస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలి. విచారించి బాధ్యులపై చర్యలు చేపడతాం.

ఔషధాల కొరత లేదుపశువులు, గొర్రెలు, మేకల చికిత్సకు పశు వైద్యశాలల్లో ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. కుక్కలకు తప్ప పశువులు, మేకలకు అన్ని రకాల మందులు పంపిణీ చేస్తున్నాం. జబ్బు ముదిరితే వాటిని నయం చేసేందుకు ఖరీదైన మందులు అవసరమైనప్పుడు మాత్రమే వాటినిమార్కెటులో తెచ్చుకోమని రైతులకు చెబుతున్నాం. ఎక్కడైనా మందులు ఇవ్వడం లేదంటే మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.

# ఇసుక రీచ్‌లలో 'అదనపు బకెట్' దందా!

భూపాలపల్లి : మండలంలోని గోదావరి తీర ప్రాంతాల వెంట ఉన్న ఇసుక రీచ్‌ల వద్ద ఇసుక లోడింగ్‌లో అదనపు బకెట్ దందా ఆగడం లేదు. గతం నుంచి ఈ పద్ధతి కొనసాగుతున్నా అపుడప్పుడు ఆపేయడం మళ్లీ కొనసాగించడం జరుగుతోంది. ప్రస్తుతం కాళేశ్వరానికి సమీపంలోని తీర ప్రాంతాల్లో 9 ఇసుక రీచ్‌లు కొనసాగుతున్నాయి. గుండ్రాత్‌పల్లి, పల్గుల నాలుగో నంబరు, కుంట్లం 2,3, పల్గులలో 5, 6, 9, 10, 11, 12 సంఖ్యల ఇసుక రీచ్‌ల వెంట నిత్యం ఇసుక లోడింగ్ జరుగుతోంది. రెండు రోజుల క్రితం అదనపు బకెట్ దందాపై ఈ ప్రాంతానికి చెందిన మహేశ్ అనే లారీ యజమాని పెట్టిన పోస్టు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో వైరల్‌గా మారింది. రెండు రీచ్‌ల వెంట అదనపు బకెట్ కోసం రూ.2000 నుంచి రూ.2500 తీసుకుంటున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొనడంతో దందా వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే 9 రీచ్‌లు నడుస్తుండగా త్వరలో పూస్కుపల్లి వద్ద మరొకటి ప్రారంభం కానుంది. గుండ్రాత్‌పల్లి ఇసుక రీచ్ వద్ద నిల్వలు లేకపోవడంతో మూడు రోజుల్లో ముగుస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా కుంట్లం 2కు త్వరలో తెర పడనుంది. ప్రధానంగా సన్నపు ఇసుక లభ్యమయ్యే రీచ్‌లలో టీయస్‌ఎండీసీ సిబ్బంది ప్రమేయంతో దందా ఎక్కువగా సాగుతున్నట్లు విమర్శలున్నాయి.. ఒక్కో లారీకి రెండు నుంచి మూడు బకెట్లు అదనంగా వేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ప్రాజెక్టు అధికారి తారక్‌నాథ్‌రెడ్డిని సంప్రదించగా అదనపు బకెట్ దందా అంటూ ఏమీ లేదన్నారు. ఆరోపణల్లో నిజానిజాలు తేలుస్తామన్నారు.

నష్టపోతున్న కౌలు రైతులు : ఇసుక డంపింగ్ కోసం రైతులకు భారీ మొత్తంలో కౌలు ఇస్తామని గుత్తేదార్లు ఒప్పందాలు చేసుకొని రైతులకు నగదు చెల్లింపులు చేయడం లేదు. మద్దులపల్లికి చెందిన రైతులకు



గుత్తేదార్లు ఎకరానికి రూ.80 వేలు ఒప్పందం చేసుకొని రెండేళ్లుగా కౌలు దాటవేస్తున్నారని పలువురు రైతులు ఇటీవల ధర్నాకు దిగారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా అమలు కాకపోవడంతో మరో మారు రైతులు భూగర్భ జల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

అంతర్గత రహదారులు అధ్వానం

పట్టణంలోని బాంబులగడ్డ, సీఆర్‌నగర్‌కాలనీ, ఆకుదారివాడ తదితర కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక ప్రజలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. కొద్ది పాటి వర్షం పడితే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. రోడ్లు, డ్రైనేజీ కాలువ నిర్మాణాలు చేపడుతామని గతంలో పురపాలక అధికారులు ప్రకటించినా ఆచరణలో అమలు కాలేదు. ఇప్పటి వరకు కొన్ని కాలనీలు, గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించకపోగా, ఉన్న మట్టి రహదారుల్లో మిషన్ భగీరథ పైపులైన్ తవ్వకాల పేరుతో గుంతల మయంగా చేస్తున్నారు. మోకాలు లోతు గుంతలు, బండరాళ్లతో వీధుల గుండా స్థానికులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓసీపీ సమీపంలోని మజీదు ప్రాంతంలో మురుగు కాలువలు లేక ఇబ్బంది పడుతున్నారు. కొద్దిపాటి వర్షం పడితే రోజుల తరబడి రోడ్ల పక్కన మురుగు నీరు నిలిచిపోతోంది. బురద నుంచి వచ్చే దుర్వాసనతో పాటు దోమల వ్యాప్తితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాకతీయఖని సెక్టార్-2 ఓపెన్ కాస్టు గని తవ్వకాల మూలంగా కాకతీయకాలనీ, శాంతినగర్, రెడ్డికాలనీ, గాంధీనగర్ కాలనీ, ఆకుదారివాడ, పక్కీరుగడ్డ, బాలాజీనగర్ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి రోజు సాయంత్రం సమయంలో బొగ్గు ఉత్పత్తి కోసం ఓసీ పేలుళ్లతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. పేలుళ్ల కారణంగా వచ్చే దుమ్ముధూళితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పేలుళ్ల సమయంలో ఇళ్లు కదిలినట్లు అనిపిస్తుందని, పలువురి ఇంటి గోడలు పగుళ్లు ఏర్పడ్డాయి. తాగునీటి సరఫరా కోసం కొత్తగా ఏర్పడిన ఇళ్ల వరకు పైపులైన్ ఏర్పాటు చేయటం లేదు. కొద్ది సంవత్సరాలుగా తాగునీటి సమస్యతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మేరకు స్థానికులు కొందరు వ్యక్తులు కలిసి సొంతంగా తాగునీటి బోర్‌లను ఏర్పాటు చేసుకున్నారు. ఓసీ పేలుళ్ల కారణంతోనే ఇటీవల బోర్‌లలో తాగునీటి చుక్క కనిపించడం లేదు. పలు కాలనీల్లో పదుల సంఖ్యలో తాగునీటి బోర్లు ఎండిపోయాయి.

నిధులు రాగానే సీసీ రోడ్లు నిర్మిస్తాం..- అవినాష్, మున్సిపల్ కమిషనర్

పట్టణంలోని అన్ని కార్మిక కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు రూపొందించి ఇటీవల ప్రభుత్వానికి పంపించాం. నిధులు విడుదల కాగానే అభివృద్ధి పనులు చేపడుతాం.. తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. నిధుల కొరత కారణంగానే ఇలాంటి సమస్యలు ఏర్పడుతున్నాయి.

# 'టన్ను' కొస్తున్న దుఃఖం

నల్గొండ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. మూడు జిల్లాల్లో రైతుల కల్లాల్లోనే దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు ఎదురు చూస్తున్నట్లు తెలిసింది. కొన్ని చోట్ల ఆర్భాటంగా ప్రారంభించినా..కొనుగోళ్లను వేగవంతం చేయడం లేదు. రానున్న రోజుల్లో కోతలు మరింత ముమ్మరం కానున్న దృష్ట్యా పరిస్థితి మరింత జఠిలం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. నల్గొండ జిల్లాలోనే కొంత ఆశాజనకంగా కొనుగోళ్లు ఉండగా..భువనగిరి జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా కలిపి మొత్తం 302 కేంద్రాలను ప్రతిపాదించగా..ఇప్పటివరకు ఒక్క కేంద్రంలోనూ కొనుగోళ్లను ప్రారంభించలేదు. ఈ ఒక్క జిల్లాలోనే 50 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కల్లాల్లో ఉంది. సూర్యాపేట జిల్లాలో మొత్తం 276 కేంద్రాలను ప్రతిపాదించగా..అధికారిక లెక్కల ప్రకారం మాత్రం 188 ప్రారంభించినట్లు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. గతంలో ఈ జిల్లాలో అవకతవకలు జరిగిన కేంద్రాలకు ఈ దఫా అధికారులు అనుమతి ఇవ్వలేదు. ఎక్కువగా తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లోని కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని దాదాపు 12 కొనుగోలు కేంద్రాలకు ఈ ఏడాది అనుమతి ఇవ్వలేదని తెలిసింది. వీటిలో గతేడాది ఏపీ నుంచి అడ్డగోలుగా ధాన్యం తీసుకొచ్చి ఇక్కడ మద్దతు ధరకు అమ్మి కొంత మంది దళారులు సొమ్ము చేసుకున్నారు. హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి నియోజకవర్గాల్లో గ్రామ సంఘాల వీబీకే (విలేజ్ బుక్ కీపర్)లు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆసక్తి చూపడం లేదు. దీంతో మహిళా సంఘాలకు అధికారులు బాధ్యత అప్పగించారు. వారూ ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో కొనుగోళ్లను చేపట్టలేదు. అవకతవకలకు జియో ట్యాగింగ్‌తో చెక్‌ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 56.44 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా.. ఉమ్మడి జిల్లాలోనే 13.20 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేశారు. సుమారు 32 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# సర్కారు భూమి కనిపించడం లే..!

మందమర్రి : మందమర్రిలోని అత్యంత విలువైన ప్రదేశంలో సుమారు ఎకరంన్నర ప్రభుత్వ సీలింగ్ భూమి ఎక్కడ ఉందో తెలియని విచిత్ర పరిస్థితి నెలకొంది. మందమర్రి పాతబస్టాండ్ సమీపంలోని ఊరు మందమర్రి చెరువు సమీపంలో వందో సర్వే నంబరులో ప్రభుత్వ భూమిని గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు తంటాలు పడుతున్నారు. ఈ సర్వే నంబర్ మొత్తం 9.30 ఎకరాలు ఉంది. అందులో 8.07 ఎకరాలు భూమికి సంబంధించి పట్టా ఉంది. మిగిలిన 1.23 ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలో ఉండాలి.కానీ..అది కనిపించడం లేదు.



ఎక్కడిదీ ఈ భూమి

ఏళ్ల క్రితం పట్టణానికి చెందిన ఓ భూస్వామి అప్పటి భూచట్టాల్లో మార్పుల కారణంగా 1.23 ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. ఈ భూమిని ప్రభుత్వ సీలింగ్ ల్యాండ్ కింద రెవెన్యూ రికార్డులో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రస్తుత పరిస్థితి ఇలా..ప్రస్తుతం వందో నంబరు సర్వేనే కాకుండా పక్కన ఉన్న సర్వే నంబర్లలో నిర్మాణాలు జోరందుకున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ సీలింగ్ భూమి ఎక్కడ ఉందో ఎవ్వరికీ తెలియని అయోమయ పరిస్థితి. ప్రస్తుతం ఈ సర్వే నంబరులో నిర్మాణాలు వివాదాస్పదంగా మారాయి. ప్రభుత్వ భూమి ఇక్కడ కాదు..అంటే ఇక్కడ కాదు.. అంటూ భూ విక్రయాలు జరుగుతున్నారు. అసలు ఈ నిర్మాణాలు.. ప్రభుత్వ భూమిలోనే జరుగుతున్నాయా..లేక పట్టాభూమిలో కొనసాగుతున్నాయో తెలియక రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు ఇక్కడ రియల్‌వ్యాపారం చేస్తుండడం వివాదంగా మారింది. ఈ విషయమై కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందినట్లు సమాచారం.

ప్రభుత్వ భూమి అని తేలితే కూల్చేస్తాం – ఎస్.శ్రీనివాస్. తహసీల్దార్ వంద సర్వే నంబరులో సీలింగ్ ప్రభుత్వ భూమి, పట్టా భూమి కూడా ఉంది. కానీ వీటిని నక్షలో సబ్ డివిజన్ (వేర్వేరుగా రికార్డుల్లో)గా నమోదు కాలేదు. దీంతో సీలింగ్ భూముల నివేదిక తెప్పించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు కలెక్టర్‌కు లేఖ రాశాం. త్వరలోనే లొకేషన్ సర్వే చేయించి హద్దులు గుర్తించి స్థలాన్ని పరిరక్షిస్తాం. ఒకవేళ ఇప్పుడు నిర్మాణాలు జరిగిన ప్రదేశంలో ప్రభుత్వ భూమి ఉంటే వాటిని కూల్చేందుకు న్యాయస్థానం అనుమతి కోరుతాం.

# అటకపై మెనూ.. పెట్టిందే తిను

ఆసిఫాబాద్ :క్రీడల్లో అత్యుత్తమ శిక్షణ ఇవ్వడంతో పాటు, బలవర్ధకమైన ఆహారం విద్యార్థులకు అందించడానికి జిల్లాలో బాలికల క్రీడా పాఠశాలను ఏర్పాటు చేశారు. ఇతర విద్యార్థినులతో పోలిస్తే వీరికి ప్రత్యేక ఆహారపట్టిక ఉంటుంది. వివిధ ఆటల్లో ప్రావీణ్యం పొందడానికి మైదానం, ఇతర వసతులు ఉంటాయి. ఆసిఫాబాద్‌లో ఈ పాఠశాలను ఏర్పాటు చేసి రెండేళ్లు దాటుతున్నా, నేటికీ మైదానం అందుబాటులోకి రాలేదు. వివిధ రకాల ఆహార పదార్థాలను విద్యార్థులకు ఇవ్వాల్సి ఉండగా అమలుకావడం లేదు. కేవలం కాగితాల్లో మాత్రమే పిల్లలకు వివిధ రకాల పదార్థాలతో భోజనాలు పెడుతున్నామని బిల్లులు తీసుకుంటున్నారు.

గిరిజన క్రీడా పాఠశాలను ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆశ్రమ బాలికల వసతిగృహంలో 2019లో ప్రారంభించారు. ప్రస్తుతం 5 నుంచి 8వ తరగతి వరకు 160 మంది విద్యార్థినులున్నారు. వసతిగృహం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, హ్యాండ్‌బాల్, ఖోఖో కోర్టులకు, హైజంప్, లాంగ్‌జంప్ కోసం వివిధ పరికరాలు అమర్చడానికి రూ.45 లక్షలను ఐటీడీఏ అధికారులు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు నాసిరకం పనులు చేపట్టడంతో, ఉపాధ్యాయులు ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సదరు గుత్తేదారు పనులను అర్ధాంతరంగా నిలిపారు. మళ్లీ టెండర్ నిర్వహించి త్వరితగతిన పనులు చేయించాల్సిన అధికారులు ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి ప్రయత్నాలు



చేయకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది.

చర్యలు తీసుకుంటాం.. – మణెమ్మ, జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి ఆహార పట్టిక అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత ఉపాధ్యాయులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. క్రీడా మైదానం పనులను సైతం టెండర్ నిర్వహించి త్వరలోనే ప్రారంభిస్తాం.

క్రీడా పాఠశాలలో ఆదివారం అన్నంతో పాటు, మాంసాహారం, ఆకుకూర పప్పు, పెరుగు, అరటిపండు ఇవ్వాలి. పిల్లలకు మాత్రం నీళ్లతో కూడిన చికెన్‌ను అందించారు. ఈ కూర సైతం అరకొరగా వడ్డించారు. ఆదివారం వసతిగృహంలో ఉపాధ్యాయులు, వార్డెన్ ఎవరూ లేకపోవడం వల్ల విద్యార్థులే వడ్డించుకోవడం కనిపించింది. ఆకుకూర పప్పు, పెరుగు, అరటిపండు పిల్లలకు ఏ ఒక్కటీ పెట్టలేదు. ఆదిలాబాద్ జిల్లా బేల కేజీబీవీలో సుమారు 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో నాణ్యమైన ఆహారంపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

మైదానం లేకపోవడం, ఎలాంటి క్రీడా వసతులు కల్పించకపోవడంతో క్రీడా పాఠశాల పేరుకు మాత్రమే ఉంది. ఏటా విద్యార్థులు ప్రవేశం పొందుతూ, మరుసటి సంవత్సరం మరో తరగతికి వెళ్లడానికి మాత్రమే పరిమితమవుతున్నారు. మూడేళ్ల నుంచి మైదానం పనులు అడుగు ముందుకు పడటం లేదు. ప్రస్తుత వర్షాలకు ఈ మైదానం సైతం పూర్తిగా చిత్తడిగా మారింది.

# బడిలో ప్రమాద ఘంటికలు



కరీంనగర్ : కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లోని పలు పాఠశాలల గదులు శిథిలావస్థకు చేరాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్లాబ్‌లపై నీరు నిలిచి, గోడలు తడిచి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల నగునూరు, ఇతర పాఠశాలల్లో పెచ్చులు ఊడిపడ్డాయి. అక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయులు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కొత్తపల్లి పట్టణ కేంద్రంలోని ఉర్దూమీడియం పాఠశాల భవనం వర్షానికి దెబ్బతింది. ఉపాధ్యాయులు సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో మండల విద్యాధికారి అక్కడి చేరుకొని గదిని ఖాళీ చేయించి పక్కన ఉన్న తెలుగు మీడియం పాఠశాలలో ఓ గది కేటాయించారు. కేటాయించిన గది ఇరుగా ఉండటంతో చెట్ల నీడనే పాఠాలు బోధించాల్సిన దుస్థితి నెలకొంది. చామనపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఇటీవల పెచ్చులు ఊడి పడ్డాయి. పాఠశాల గోడలు పగుళ్లుబారి ప్రమాదకరంగా ఉంది. నగునూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండలంలోనే విద్యార్థులకు సంఖ్య అధికం. 400 మంది వరకు చదువుతుంటారు. ఇటీవల ప్రధానోపాధ్యాయుడి గదిలో పెచ్చులు ఊడి పడ్డాయి. ఆ సమయంలో ప్రధానోపాధ్యాయుడు గదిలో లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. మొగ్దుంపూర్ మండల పరిషత్తు పాఠశాల ఇదివరకే శిథిలావస్థకు చేరుకొంది. ఏకధాటిగా కురుస్తున్న వానలకు ఆ పాఠశాల స్లాబ్ ప్రమాదకరంగా మారింది. బీరువా, ఇతర సామగ్రిని కాపాడటానికి ఉపాధ్యాయులు తిప్పలు పడుతున్నారు. పక్కన చిన్న రెండు గదులు ఉండగా అందులో విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. అయిదో తరగతి వరకు 50 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఇరుకు గదుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని పాఠశాలలు 'మన ఊరు.. మన బడి' కార్యక్రమంలో మొదటి విడత ఎంపికైనా మరమ్మతులు ఎప్పుడు చేపడతారో ఎవరికీ తెలియని పరిస్థితి. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మరమ్మతులు, అదనపు తరగతి గదుల నిర్మాణానికి జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తోడ్పాటును అందిస్తే విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేసిన వారవుతారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదించాం : –మధుసూదన్‌చారి, ఎంఈవో, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి. పలు పాఠశాలల్లో సమస్యలు మా దృష్టికి వచ్చాయి. ఉన్నతాధికారులకు నివేదించాం. అవసరమైన చర్యలు చేపడుతున్నాం, 'మన ఊరు.. మన బడి' కార్యక్రమంలో మొదటి విడత కొన్ని పాఠశాలలు ఎంపికయ్యాయి. త్వరలోనే మరమ్మతు పనులు ప్రారంభిస్తాం.

# విద్యార్థుల ఆరోగ్యంపై నీలినీడలు



సిరిసిల్ల : ఈ చిత్రంలోనిది సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ బాలుర ఉన్నత పాఠశాల. ఇందులో 650 మంది విద్యార్థులున్నారు. మూత్రశాలలు వినియోగించాక శుభ్రం చేసేవారులేక పాఠశాల ఆవరణలో దుర్గంధం వ్యాపిస్తోంది. ఉపాధ్యాయులు సొంత డబ్బులతో ఒకరిని నియమించుకుని శుభ్రం చేయిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు ఇదే పరిస్థితి. అసలే వ్యాధుల కాలం. అపరిశుభ్రతతో విద్యార్థులు అనారోగ్యాల బారిపడే అవకాశం ఎక్కువగా ఉంది. వర్షాలకు పాఠశాలలు, వసతి గృహాల ఆవరణలు చిత్తడిగా మారాయి. ఖాళీ ప్రదేశాల్లో నీరు నిలిచి దోమలకు ఆవాసాలు ఏర్పడ్డాయి. వాతావరణ మార్పులతో ఇప్పటికే చాలా పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు జలుబు, దగ్గు, జ్వరం వంటి సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. పాఠశాలలు తెరిచి దాదాపు 50 రోజులు గడిచినా పారిశుద్ధ్య నిర్వహణపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వైద్యసిబ్బంది కేవలం కరోనా టీకాలకే పరిమితమయ్యారు. పంచాయతీలు, పురపాలక సంఘాల్లోని పారిశుద్ధ్య సిబ్బందికి పాఠశాలలను శుభ్రం చేసే బాధ్యతలను అప్పగించినా.. అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

ఇదీ పరిస్థితి…జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో కలిపి 48,550 మంది విద్యార్థులు చదువుతున్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. సిరిసిల్ల సమీపంలోని పెద్దూరులోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు వారం రోజులుగా విషజ్వరాల బారిన పడుతున్నారు. ఆదివారం విషయం వెలుగులోకి రావడంతో హుటాహుటిన వైద్యపరీక్షలు నిర్వహించారు. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీరు వంటి వసతి సౌకర్యాలపై విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తంగళ్లపల్లి గురుకులంలోనూ విద్యార్థులకు కరోనా లక్షణాలు ఉండటంతో వైద్యపరీక్షలు నిర్వహించారు.

చేయాల్సినవి ఇవీ… వ్యక్తిగత పరిశుభ్రత, మందులు, టీకాల వివరాలు ఆరోగ్య కార్డుల్లో నమోదు చేయాలి. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠశాలలో చేరిన వారికి ఆరోగ్య కార్డులు అందజేయాలి. వారంలో ఒక రోజు ఆరోగ్య దినోత్సవం నిర్వహించాలి. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో పిల్లలందరికీ ఏటా రెండు సార్లు పరీక్షలు చేయాలి.

కొంత ఆలస్యమైంది– రామకృష్ణ, వైద్యుడు, జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారిజిల్లాలో ఆర్‌బీఎస్‌కే బృందాలు ఆరు ఉన్నాయి. అల్లోపతి, ఆయుష్ వైద్యులు, ఏఎన్‌ఎంలతో పది రోజుల నుంచే పాఠశాలల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. వర్షాలు, కరోనా టీకాలతో కొంత ఆలస్యమైంది. మందులకు, వైద్య చికిత్సలకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఇక నుంచి విద్యార్థుల ఆరోగ్యంపై పూర్తిగా దృష్టి సారిస్తాం.

మూడేళ్లుగా ఆరోగ్య కార్డుల ఊసే లేదుకరోనా వ్యాప్తికి ముందు 2019 వరకు జిల్లాలో ఆర్‌బీఎస్‌కే వైద్య పరీక్షలు నిర్వహించారు. తరవాత మరిచిపోయారు. మూడేళ్లుగా విద్యార్థులకు ఆరోగ్య కార్డుల పంపిణీ ఊసేలేదు. విద్యార్థులకు చెవి, ముక్కు, గుండె వంటి 30 రకాల వ్యాధులకు తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలి. ఏఎన్‌ఎంలు కరోనా టీకాలతోనే సరిపెడుతున్నారు. బాలలకు ఏ చిన్న సమస్య తలెత్తినా తల్లిదండ్రులు ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్లడంతో వైద్య ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. దీనిని పూర్తిస్థాయిలో అమలులోకి తీసుకొస్తే సీజనల్ వ్యాధులతోపాటు ఇతర అనారోగ్య సమస్యలను దూరం చేసే అవకాశం ఉంది. వైద్య, విద్యాశాఖ అధికారుల మధ్య సమన్వయం కొరవడటం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఈ పథకం మరుగున పడిపోయింది.

చిన్నోడికి జ్వరమొచ్చింది

ముసురు వర్షాలు… వాతావరణంలో పెనుమార్పులతో వసతి గృహాల్లోని విద్యార్థులకు జ్వరాలు ప్రబలుతున్నాయి. దగ్గు, జలుబు, ఒళ్లునొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంతోపాటు దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, అల్మాస్‌పూర్‌లోని కేజీబీవీలలోని పరిస్థితులను పరిశీలించింది. వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో 20 మంది, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 480 మంది, కేజీబీవీలో 150 మంది విద్యార్థులు ఉంటున్నారు. రాచర్ల గొల్లపల్లిలోని వెనుకబడిన బాలుర వసతి గృహంలో రోజూ ఒకరిద్దరు విద్యార్థులకు స్వల్ప జ్వరాలు వస్తుండగా మాత్రలతో తగ్గిపోతున్నట్లు సిబ్బంది తెలిపారు. అల్మాస్‌పూర్‌లోని కేజీబీవీలో ఏడో తరగతి విద్యార్థినులు బి.సాత్విక, ఎన్.దేవకి, హర్షిణిలకు జ్వరాలు రాగా మరో విద్యార్థిని ఎన్.సింధు కడుపులో మంటతో బాధపడుతోంది. స్థానిక ఏఎన్‌ఎం నిర్మల విద్యార్థులకు జ్వర పరీక్ష చేసి మాత్రలు అందజేశారు. కేజీబీవీలో గడిచిన వారం రోజుల వ్యవధిలో సుమారు 12 మంది జ్వరాల బారినపడగా ఆరుగురు కోలుకున్నారు. మరో ఆరుగురు ఇళ్లకు వెళ్లిపోయారు. కేజీబీవీలో ప్రాంగణంలో గడ్డి బాగా పెరిగిపోయింది. ఒకచోట పైపులైన్ లీకేజీ ఏర్పడగా మరోచోట కాల్వ సంపు చెడిపోవడంతో మురుగు నిల్వ ఉంటుంది. దోమలు, ఈగలు వ్యాప్తి చెందడంతో జ్వరాలు ప్రబలుతున్నట్లు తెలుస్తోంది. మంచాలు లేక అక్కడ విద్యార్థినులు నేలపైనే పడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నివాస గది(డార్మెంట్) కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. గది ఇరుకుగా ఉండటంతో కొందరు విద్యార్థినులు రాత్రిపూట తరగతి గదుల్లో నిద్రించాల్సి వస్తోంది. దోమలు, ఈగలు లోనికి రాకుండా భవన సముదాయంలోని కిటికీలు, పైన ఉండే వెంటిలేటర్లకు దోమతెర జాలీలు అమర్చాలని విద్యార్థినులు కోరుతున్నారు.

సమస్యల వలయంలో… సారంపల్లి ఇందిరమ్మకాలనీలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 460 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. గిరిజన గురుకుల పాఠశాల కోసం కేవలం తరగతి గదులే నిర్మించారు. డైనింగ్ హాల్, కిచెన్, హాస్టల్ భవనం, సరిపడా బాత్‌రూంలు లేవు. 460 మంది విద్యార్థులతోపాటు సిబ్బందికి కలిపి 24 బాత్‌రూంలు మాత్రమే ఉన్నాయి. తరగతి గదుల్లోనే ఉండటం, అందులోనే చదువుకోవడం, భోజనాలు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే సుమారు 40 మందికి జ్వరాలు వచ్చాయి. ఇద్దరికి కరోనా పాజిటివ్ రావడంతో మిగతా వారికి సైతం కరోనా పరీక్షలు చేశారు. వైరల్ జ్వరాలు రావడంతో కొంత మంది ఇంటికి వెళ్లిపోతున్నారు.

ఆర్వో ప్లాంటు పని చేయక… మండలంలోని నామాపూర్ ఆదర్శ పాఠశాల వసతి గృహంలో 24 మంది బాలికలు ఉన్నారు. తాగునీరందించే ఆర్వో ప్లాంట్ చెడిపోయి దాదాపు ఆరు నెలలు అవుతుంది. దీంతో పాఠశాల ఆర్వో ప్లాంట్ నుంచి వసతి గృహం విద్యార్థులకు అందిస్తున్నారు. ముస్తాబాద్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 446 మంది విద్యార్థులు ఉన్నారు. హ్యాండ్ వాస్ బేషన్ చాలడం లేదు. దుస్తులు ఉతుక్కునేందుకు ఓపెన్ బాతురూం నిర్మాణం చేపట్టాలి. చెత్తాచెదారం వంటశాల సమీపంలో కాల్చివేస్తున్నారు. కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రహరీ కింద నుంచి వరద ఆవరణలోకి వచ్చి చేరుతుంది. నీరు నిల్వ ఉండకుండా అంతర్గత పైపులైన్ వేసి నీరు మళ్లించాలి.

# రండి.. పచ్చతోరణం కట్టేద్దాం..!

ఆసిఫాబాద్ :ప్రస్తుతం ఎక్కడ చూసినా హరిత పండగ కనిపిస్తోంది…వర్షాలు సమృద్ధిగా కురవడంతో విరివిగా మొక్కలు నాటుతున్నారు.. రోజురోజుకు తరిగిపోతున్న అడవులను తిరిగి పెంపొందించుకుని వాటిని సంరంక్షించుకునేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇళ్లతో పాటు రహదారులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు..ఖాళీ స్థలాన్ని వదలకుండా నాటేందుకు ప్రణాళికలు రూపొందించారు. నాటిన ప్రతీ మొక్కను కాపాడటం మన బాధ్యతగా గుర్తించాలి. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు వివిధ రాజకీయ పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థలు.. విద్యార్థులు ఇలా ప్రతీ ఒక్కరు భాగస్వాములైతేనే లక్ష్యం నెరవేరుతుంది. చిన్నగా పెరిగే మొక్క పొడవు, వెడల్పు, లోతు 30 సెంటీ మీటర్లు, మధ్యస్థంగా పెరిగే దానికి 45 నుంచి 60, ఏపుగా పెరిగే చెట్ల గుంతలు మీటరు ఉండేలా తవ్వాలి. మట్టి తీసేటప్పుడు ఒకే వైపుకు కుప్పగా పోయకూడదు. భూమిపై పొరలో అంటే 15 నుంచి 30 సెంటీ మీటర్ల మధ్య మట్టి సారవంతంగా ఉంటుంది. ఈమట్టిని ఒక వైపు, లోతు మట్టిని మరో వైపు పోయాలి. అడుగు గట్టిగా ఉంచకుండా పొడి మట్టిని ఉంచాలి. గుంత తీసిన తర్వాత రెండు, మూడు రోజులకు మొక్క నాటితే క్రిమికీటకాలు నశిస్తాయి. నాటే ముందు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 50 గ్రాములు, క్లోరిడిన్ డస్ట్ 50 గ్రాముల ఎరువు గుంత అడుగున కొంత, లోతున తీసిన మట్టికి మరి కొంత కలపాలి. ఇప్పుడు ఆ తర్వాత లోపల తీసిన మట్టిని మొదట, పైమట్టిని పైనే వేయాలి. నాటిన తర్వాత కొంత మట్టిని మొక్క చుట్టూ ఎత్తుగా ఉంచాలి. వర్షం పడుతుండగా



మొక్కలు నాటకూడదు.

ఒక్కసారి ఈ చెట్లను చూడండి…

ఇవి జన్నారం మండలం చింతగూడ ప్రధాన రహదారి నుంచి శ్రీలక్ష్మీదేవి ఆలయం వరకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు. హరితహారంలో భాగంగా ఐదేళ్ల కిందట రహదారికి ఇరువైపులా సుమారు 200 చెట్లను నాటారు. ప్రతీ మొక్కకు ట్రీగార్డ్స్ ఏర్పాటు చేశారు. అక్కడ అటవీ సిబ్బంది, గ్రామస్థులు కలిసి మొక్కలు ఎండిపోకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. వేసవి కాలంలో ట్యాంకర్ల ద్వారా నీరు పోయడంతో భారీ వృక్షాలయ్యాయి. ప్రస్తుతం ఈ చెట్లు స్థానిక లక్ష్మీదేవి ఆలయానికి వచ్చే భక్తులకు సేద తీరడానికి, వీటి కింద వంట చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడ్తున్నాయి. ఇదేవిధంగా లక్సెట్టిపేట– చందారం,, జన్నారం– ధర్మారం , దండేపల్లి మండలంలోని ముత్యంపేట నుంచి రెబ్బనపల్లికి వెళ్లే రహదారికి ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు నేడు వృక్షాలయ్యాయి.

ఇంటింటికీ మొక్కలు

ప్రతీ పంచాయతీతో పాటు పురపాలికల్లో నర్సరీలు ఏర్పాటు చేసి అన్ని రకాల మొక్కలు పెంచారు. మొక్కలను అన్ని విధాలుగా సంరక్షించడంతో ఏపుగా పెరిగాయి. ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు అందజేసి వీటిని నాటి సంరక్షించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. నర్సరీలో వివిధ రకాల పండ్లు, పూలు, ఇతర మొక్కలు ఉండటంతో అవసరమున్న వారు ఉచితంగా తెచ్చుకుని ఇంటి వద్ద నాటుకోవచ్చు. పుట్టినరోజు, ఇతర శుభకార్యాలకు గుర్తుగా, వివిధ రాజకీయ పార్టీల నాయకులపై అభిమానంతో మొక్కలు నాటడం చూస్తున్నాం. వీటిని నాటి వదిలేయకుండా బాధ్యతగా సంరక్షించాలి. మొక్క నాటిన తర్వాత వాటికి వెదురు లేదా ఇనుప కంచెలు ఏర్పాటు చేసుకోవాలి. ఒక వేళ మొక్క చనిపోతే మళ్లీ మొక్కను వెంటనే నాటాలి. ఇందుకు కొన్ని మొక్కలు అందుబాటులో ఉంచాలి. ప్రహరీలు లేని కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. ఇటీవల ఓ రహదారి పక్కన నాటిన మొక్కలకు ట్రీగార్డులు లేకపోవడంతో జిల్లా పాలనాధికారి వెంటనే వీటిని ఏర్పాటు చేశారు.

# శివ..శివా.. నీ దారే ఇలా..!

ఆసిఫాబాద్ : అసలే శ్రావణమాసం.. భక్తితో శివదర్శనానికి బయలుదేరారు. శివ..శివా అంటూ వాహనాల్లో ఊరు దాటి అటవీలోకి ప్రవేశించగానే భగవంతుడు నేరుగా కనిపించేలా ఉంది ఆ దారి. ఇంకేముంది..వాహనదారుల ఆపసోపాలు.. అష్టకష్టాలు పడుతూ.. బురదను దాటుతూ.. దైవదర్శనానికి చేరుకున్నారు. ఉమ్మడి జిల్లాలోనే ప్రాముఖ్యత కలిగిన శైవక్షేత్రం అది. ఇదంతా బాగానే ఉన్నా.. ఇక్కడికి చేరాలంటే నరకయాతన పడాల్సిందే. అదే బెల్లంపల్లి మండలంలోని శ్రీబుగ్గ రాజేశ్వరాలయం. బెల్లంపల్లి పట్టణానికి కూతవేటు దూరంలోనే ఉంటుంది. ఆలయ అభివృద్ధికి పాలకులు, ఆలయ పాలకవర్గం పట్టించుకోకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. శ్రావణమాసంలోని మొదట భక్తులు ఆలయానికి పోటెత్తారు. దారిపొడవునా బురద ఉండటంతో నానాతంటాలు పడ్డారు. ఈ రహదారి నిర్మాణానికి ఇప్పటికే నిధులు సుమారు రూ.3 కోట్లు, 2019లోనే మంజూరయ్యాయి. అటవీ అనుమతుల పేరుతో పనులను గుత్తేదారు నిలిపివేశారు. దేవాదాయశాఖ అధికారులు సైతం ఆదాయంపైన దృష్టి సారించారు తప్ప మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అటవీప్రాంతంలో ఉండటంతో పర్యాటక కేంద్రంగా మారుస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా రహదారి నిర్మించడంతో పాటు ఆలయంలో కనీస సౌకర్యాలను కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

# పండుగలా విద్యాకానుక.. మేనమామగా సంతోషిస్తున్నా: సీఎం జగన్



పల్నాడు: వీళ్లు చిన్నారులు వీళ్లకు ఓటు హక్కు లేదు.. పట్టించుకోవాల్సిన అవసరం లేదు అనేది గతం. కానీ, ఇవాళ వాళ్ల జగన్ మామ ప్రభుత్వంలో విద్యాకానుక ఓ పండుగలా జరుగుతోంది. ఒక ఎమ్మెల్యే దగ్గరి నుంచి ప్రతీ ప్రజాప్రతినిధులందరూ పిల్లలతో కలిసి ఈ పండుగలో పాల్గొంటుడడం.. ఆ పిల్లల మేనమామగా సంతోషపడుతున్నా: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమంలో భాగంగా.. సోమవారం పల్నాడు జిల్లా క్రోసూర్‌లో జరిగిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారాయన. “పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యాకానుక అందిస్తున్నాం. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యార్థులకు విద్యాకానుక కిట్లు ఇస్తున్నాం. కిట్లలో మెరుగైన మార్పులు తెచ్చాం. ప్రతీ విద్యార్థికి మూడు జతల యూనిఫామ్, స్కూల్ బ్యాగ్, షూస్, సాక్సులు అందిస్తున్నాం. నోట్ బుక్స్, వర్క్ బుక్స్?, బైలింగువల్ పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలతో పాటు బ్యాగు సైజులు పెంచాం. యూనిఫామ్ డిజైన్‌లోనూ మార్పులు చేశాం అని తెలిపారాయన. ఈ ఒక్క పథకం మీదే ఈ నాలుగు ఏళ్లలో ఈ పిల్లల మేనమామ ప్రభుత్వం అక్షరాల రూ. 3,366 కోట్లు ఖర్చు చేశామని చెప్పడానికి గర్వపడతున్నాం అని సీఎం జగన్ చెప్పారు.

# హడావుడి, ఆర్భాటం లేకుండా యాగం చేపట్టిన పవన్ కళ్యాణ్..



అమరావతి: ధర్మ పరిరక్షణ.. ప్రజా క్షేమం.. సామాజిక పరివర్తన ఆకాంక్షిస్తూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ యాగం చేపట్టారు. మంగళగిరిలో జనసేన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఈ యాగం జరుగుతోంది. ధర్మో రక్షతి రక్షితః అనే ధార్మిక సూత్రాన్ని మనసా వాచా కర్మణా విశ్వసించే పవన్ కళ్యాణ్.. ధర్మ పరిరక్షణ, సామాజిక పరివర్తన, ప్రజా క్షేమం, ప్రకృతి విపత్తుల నివారణ, అభివృద్ధి యాగానికి గణపతి పూజతో స్వయంగా అంకురార్పణ చేశారు. ఉదయం 6:55 గంటలకు సంప్రదాయబద్ధంగా పట్టువస్త్ర ధారణలో యాగశాలలో జనసేనాని దీక్ష చేపట్టారు. ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సకల సౌభాగ్యాలతో విలసిల్లాలనే ఆకాంక్షతో దేవతామూర్తులకు ప్రణతులు అర్పించారు. యాగశాలలో అయిదుగురు దేవతామూర్తులను ప్రతిష్టాపన చేశారు. ఈ ఐదు దేవతా మూర్తులకు అభిముఖంగా యంత్ర స్థాపన జరిగింది. విగ్రహం, యంత్రం, హోమం ఆలంబనగా నేటి ఉదయం ప్రారంభమైన యాగం రేపు కూడా కొనసాగుతుందని ప్రకటన వెలువడింది.

ఎటువంటి హడావిడి, ఆర్భాటం లేకుండా కేవలం రుత్వికులు మాత్రమే సంప్రదాయబద్ధంగాగ పవన్ కళ్యాణ్ యాగం నిర్వహిస్తున్నారు.

# సాధారణ భక్తులకు ప్రాధాన్యత.. టీటీడీ ప్రయోగం సక్సెస్

## భక్తులకు వెంకన్న దర్శన భాగ్యం - సర్వదర్శనం.. దగ్గరి నుంచే గోవిందా - తిరుమల తిరుపతి వెంకన్న రికార్డు దర్శనాలు



తిరుమల: సాధారణ కేటగిరీ భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చేసిన ప్రయోగం సఫలమైంది. వెండి వాకిలి నుంచి సింగిల్ క్యూలైన్ విధానం పాటించడంతో అత్యధిక భక్తులు సులభతరంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం రోజు రికార్డు స్థాయిలో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వారాంతం కావడం, ఆదివారంతో వేసవి సెలవులు ముగియనున్న నేపథ్యంలో తిరుమలలో కిలోమీటర్లమేర భక్తులు క్యూ లైన్‌లలో స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. గత నాలుగేళ్లలో నిన్న శ్రీవారిని దర్శించుకున్న భక్తులే అత్యధికం కావడం విశేషం. ఆదివారం రోజు శ్రీవారిని 92,238 మంది భక్తులు దర్శించుకున్నారు. సర్వదర్శనం క్యూలైన్ ద్వారానే 70 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. క్యూలైన్ మార్పులపై ఈవో ధర్మారెడ్డి నిరంతరం పర్యవేక్షించారు.

**తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ :** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి దర్శనానికి 31 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 24 గంటలు, ప్రత్యేక దర్శనానికి 4 గంటల సమయం పడుతోంది.

ఆదివారం రోజు 92,238 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 40,400 మంది తలనీలాలు సమర్పించారు. నిన్న ఒక్క రోజు శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.02 కోట్లు వచ్చింది.

# ఏపీకి రూ.4787 కోట్లు.. తెలంగాణకు రూ.2486 కోట్లు



దిల్లీ: కేంద్ర పన్నులు, సుంకాల్లో రాష్ట్రాల వాటా కింద కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం నిధులు విడుదల చేసింది. జూన్ నెలకు గానూ మూడో విడత కింద మొత్తం రూ.1,18,280 కోట్లు విడుదల చేసినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. జూన్ నెలలో చెల్లించాల్సిన విడతతో పాటు ఒక విడత అడ్వాన్స్ మొత్తాన్ని సైతం విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ పేర్కొంది. ఈ మొత్తాన్ని మూలధన వ్యయాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు వేగవంతానికి వినియోగించాలని రాష్ట్రాలకు ఆర్థిక శాఖ సూచించింది. అలాగే, ప్రధాన ప్రాజెక్టులు/స్కీముల అమలుకు అవసరమైన నిధులు అందించే ఉద్దేశంతో ఈ నిధులు విడుదల చేసినట్లు తెలిపింది. ఇందులో భాగంగా పన్నుల వాటా కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.4,787 కోట్లు, తెలంగాణకు రూ.2,486 కోట్లు దక్కాయి. కేంద్రం వసూలు చేసే పన్నుల్లో 41 శాతం వాటాను కేంద్రం రాష్ట్రాలకు అందిస్తోంది. ఈ మొత్తాన్ని ఒక ఆర్థిక సంవత్సరంలో 14 విడతల్లో విడుదల చేస్తోంది.

# ఆ మంత్రి సిగ్గుతో తల దించుకోవాలి



నెల్లూరు: రాష్ట్రంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి బాధ్యతలు తీసుకున్న తర్వాత అవినీతి పెరిగిపోయిందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి కాకాణి అవినీతిని లైసెన్సడ్ చేసేశారని విమర్శించారు. రైతుల పరికరాల్లో అవినీతి జరిగిందని అగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ సీఎంకి లేఖ రాశారని గుర్తుచేశారు.

ఎస్సీ ఆర్థిక సంస్థ 24 కోట్ల వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారని.. దీంతో మంత్రి సిగ్గుతో తల దించుకోవాలని వ్యాఖ్యానించారు. కోర్టు ఫైల్స్ దొంగతనం చేసిన వ్యక్తికి మంత్రి పదవి ఇవ్వడం సీఎం తప్పు అన్నారు. టీడీపీ హయాంలో కంటే లక్ష ఎక్కువ పెట్టి రైతులకి ట్రాక్టర్లు అమ్ముతున్నారని ఆరోపించారు. కాకాణి రైతుల కోసం ఒక్క జీవో తెచ్చుడా? అని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వంలో కాకాణి మంత్రిగా ఆత్మహత్యల్లో ఏపీ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. యాంత్రీకరణ పరికరాల్లో దాదాపు రూ.200 కోట్లు కుంభకోణం జరిగిందని విమర్శించారు. అగ్రికల్చర్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రిగా కాకాణి గోవర్ధన్ రెడ్డిని బర్తరఫ్ చేయాలన్నారు

# అందరూ సమానంగా ఉండాలనే జగనన్నవిద్యాకానుక ఇస్తున్నాం : మంత్రి బొత్స సత్యనారాయణ

పల్నాడు: పేద, ధనిక వ్యత్యాసం లేకుండా అందరూ సమానంగా ఉండాలనే ఈ విద్యాకానుక ఇస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరులో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం వైయస్ జగన్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడారు. అందరికీ నమస్కారం, ఈ రాష్ట్రంలో చదువుల విప్లవం సాగుతోంది.

మన విద్యార్థి గ్లోబల్ సిటిజెన్ గా నిలబడాలనే ఆలోచనతో సీఎంగారు విద్యా విధానంలో మార్పులు తీసుకొస్తున్నారు. పేద, ధనిక వ్యత్యాసం లేకుండా అందరూ సమానంగా ఉండాలనే ఈ విద్యాకానుక ఇస్తున్నాం, గోరుముద్దలో రోజుకో మెనూ పెట్టి చక్కటి భోజనం ఇస్తున్నాం, 8 వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ లు ఇస్తూ బైజూస్ కంటెంట్ కూడా అందజేస్తున్నాం, ఐఎఫ్ పీలతో భోదన జరగాలని సీఎంగారు చెబితే ఆశ్చర్యపోయాం, కానీ ఏ రాష్ట్రంలో లేని విధంగా మన విద్యార్థులకు చక్కటి చదువులు అందించేలా ఏర్పాట్లు చేశాం, టోఫెల్ శిక్షణ కూడా అందజేయడం విశేషం, దేశంలోనే ఏపీ మేటి రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి మీ మద్దతు అవసరం, అలాంటి శాఖను నాకు అప్పగించిన సీఎంగారికి కతజ్ఞతలు తెలుపుతున్నాను.



# పెరిగిన చైనా అణు ఆయుధాలు!

స్టాక్‌హోమ్: ప్రపంచ్యాప్తంగా భౌగోళిక రాజకీయాల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఓ కీలక నివేదిక ఆసక్తికర విషయాన్ని వెల్లడించింది. పలు దేశాలు తమ అణ్వస్త్రాల సంఖ్యను పెంచుకుంటున్నాయని ‘స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్’ నివేదిక తెలిపింది. మన పొరుగు దేశం చైనా అణ్వస్త్ర సామర్థ్యం గణనీయంగా పెరిగినట్లు పేర్కొంది. ఇతర అణ్వస్త్ర దేశాలు సైతం తమ ఆయుధాలను ఆధునికీకరిస్తున్నాయని వెల్లడించింది. గత కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా అణు ఆయుధాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. అయితే, తాజాగా ఈ ట్రెండ్‌కు ముగింపు పడిందని సిప్రీ డైరెక్టర్ డ్యాన్ స్మిత్ తెలిపారు. అణ్వస్త్ర సామర్థ్యం ఉన్న తొమ్మిది దేశాలు బ్రిటన్, చైనా, ఫ్రాన్స్, భారత్, ఇజ్రాయెల్, ఉత్తర కొరియా, పాకిస్థాన్, రష్యా, అమెరికా దగ్గర 2023 నాటికి 12,512 అణు ఆయుధాలు ఉన్నాయని సిప్రీ నివేదిక తెలిపింది. క్రితం ఏడాది ఈ సంఖ్య 12,710గా ఉన్నట్లు పేర్కొంది. వీటిలో 9,576 అణు ఆయుధాలు సైనిక భాండాగారాల్లో ఉన్నాయని తెలిపింది. ఇవన్నీ వినియోగానికి సిద్ధంగా ఉన్నట్లేనని వెల్లడించింది. ఇలా సైనిక అవసరాలకు వాడడానికి సిద్ధంగా ఉన్న అణ్వస్త్రాల సంఖ్య క్రమంగా పెరుగుతోందని తెలిపింది. అత్యధికంగా చైనా అణు ఆయుధాల సంఖ్య 350 నుంచి 410కి పెరిగినట్లు సిప్రీ నివేదిక తెలిపింది. భారత్-చైనా మధ్య గతకొన్నేళ్లుగా సరిహద్దుల వద్ద ఘర్షణ వాతావరణం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో చైనా అణుసామర్థ్యం పెరగడం పరిగణనలోకి తీసుకోవాల్సిన విషయమని నిపుణులు అంటున్నారు. భారత్, పాకిస్థాన్, ఉత్తర కొరియా దగ్గర ఉన్న అణు ఆయుధాల సంఖ్య సైతం పెరిగినట్లు సిప్రీ తెలిపింది. రష్యా వద్ద మాత్రం స్వల్పంగా పెరిగినట్లు వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అణ్వస్త్రాల సంఖ్యలో ఇప్పటికీ అమెరికా, రష్యా వద్దనే 90 శాతం ఉన్నాయని తెలిపింది. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాతే అణు నిరాయుధీకరణ కార్యక్రమం గాడి తప్పిందని పేర్కొంది.



# ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. ఏడుగురి దుర్మరణం

నల్లజర్ల: తూర్పు గోదావరి జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. నల్లజర్ల మండలం అనంతపల్లి శివారులో వంతెనపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని ప్రకాశ్‌నగర్‌కు చెందిన 8 మంది హైదరాబాద్‌లో వివాహానికి హాజరై తిరిగి స్వస్థలానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో నల్లజర్ల మండలం అనంతపల్లి శివారులో హైవేపై ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను మిద్దె సత్యనారాయణ (46), మిద్దె రవితేజ (24), మిద్దె అరుణ (26), దాసరి శ్రావణి (26), రేలంగి లక్ష్మి (50), లోహిత్ గగన్ (8), అటుకూరి దుర్గ (50)గా గుర్తించారు. వీరిలో కొవ్వూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దుర్గ మృతిచెందారు. గాయపడిన వారిలో మిద్దె సాయి ఆరోగ్యం నిలకడగా ఉంది. ప్రస్తుతం ఆయన కొవ్వూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కొవ్వూరు డీఎస్పీ వర్మ తెలిపారు.



# ముంబయిలో విమానాలకు బిపోర్‌జాయ్ ఎఫెక్ట్

ముంబయి: అరేబియా సముద్రంలో ఏర్పడిన ‘బిపోర్‌జాయ్’ తుపాను అతి తీవ్ర తుపానుగా మారింది. ఇది తీరం దిశగా కదులుతుండటంతో బలమైన గాలులు వీస్తున్నాయి. దీంతో ముంబయి ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. గాలుల తీవ్రతతో కొన్ని విమానాలను రద్దు చేయగా.. చాలా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. కొన్ని విమానాలకు ల్యాండ్ చేసే పరిస్థితి లేక మరో ఎయిర్‌పోర్టుకు దారిమళ్లిస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఎయిరిండియా నిన్న అర్ధరాత్రి ట్విటర్‌లో అప్‌డేట్ ఇచ్చింది. “వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ముంబయి ఎయిర్‌పోర్టులోని 09/27 రన్‌వేను తాత్కాలికంగా మూసివేశారు. దీంతో కొన్ని విమానాలు ఆలస్యం/రద్దయ్యాయి. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. ఆలస్యాన్ని తగ్గించేందుకు సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం” అని ఎయిరిండియా తెలిపింది. అటు ఇండిగో కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. తప్పనిసరి పరిస్థితుల్లోనే విమానాలు ఆలస్యమవుతున్నట్లు పేర్కొంది. అయితే, గంటల తరబడి ఎయిర్‌పోర్టులో ఎదురుచూస్తున్న ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు సరైన సౌకర్యాలు కూడా కల్పించడం లేదని సోషల్‌మీడియాలో ట్వీట్లు చేస్తున్నారు.

బిపోర్‌జాయ్ తుపాను గుజరాత్‌లోని కచ్, పాకిస్థాన్‌లోని కరాచీల మధ్య ఈ నెల 15వ తేదీన తీరాన్ని దాటనుందని భారత వాతావరణశాఖ వెల్లడించింది. ప్రస్తుతం తూర్పు మధ్య అరేబియా తీరంలో కేంద్రీకృతమైన ఈ తుపాను.. గంటలకు 8 కి.మీల వేగంతో ఈశాన్య దిశగా కదులుతున్నట్లు ఐఎండీ తెలిపింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 135-150 కి.మీల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో కచ్, సౌరాష్ట్రలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అటు గుజరాత్ తీరంలో అలల ఉద్ధృతి ఎక్కువగా ఉంది. దీంతో జూన్ 15 వరకు అరేబియా సముద్రంలోకి వెళ్లొద్దని మత్స్యకారులను అధికారులు హెచ్చరించారు. మరోవైపు, తుపాను ప్రభావంతో ముంబయిలో నేడు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.

# ఏపీ మంత్రి ఛాంబర్‌కు తాళం.. 8 నెలలుగా జీతాల్లేవంటూ సిబ్బంది నిరసన



అమరావతి: ఏపీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు అమరావతిలోని సచివాలయ సిబ్బంది షాకిచ్చారు. ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వట్లేదంటూ విధులకు గైర్హాజరయ్యారు. గతేడాది నవంబర్ నుంచి వేతనాలు రాలేదంటూ సచివాలయంలోని ఆయన ఛాంబర్‌కు తాళం వేసి నిరసన తెలిపారు. మంత్రి, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోయిందని వాపోయారు. జీతాలు చెల్లించేవరకు తాళాలు తెరిచేది లేదని వారు తేల్చిచెప్పారు.

# కొత్తగూడెం నుంచి ఏపీకి వస్తూ కార్లో పేపర్ చదివగలిగాను కానీ..: నారాయణ

తిరుపతి: తెలంగాణ, తమిళనాడుల్లో రోడ్లతో పోలుస్తూ ఏపీలో రోడ్ల దుస్థితిపై సీపీఐ నారాయణ మండిపడ్డారు. కొత్తగూడెం నుంచి ఏపీకి వస్తూ కార్లో పేపర్ చదివగలిగానని, ఏపీలోకి రాగానే పేపర్ చదవలేని విధంగా కారు తీవ్ర కుదులకు గురవుతూనే ఉందన్నారు. ఇదే పరిస్థితి తమిళనాడు నుంచి ఏపీకి వస్తే కూడా ఉంటోందన్నారు. తమిళనాడులో రోడ్లు బాగున్నాయని చెప్పారు. ఏపీ బార్డర్ లోకి వస్తూనే ఒకటే కుదుపులు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు రాష్ట్రాల్లో రోడ్లు బాగుండి, ఏపీలో రోడ్లు ఎందుకు ఈ దుస్థితి... ? దీనికి కారణం ఎవరు? అని ఆయన ప్రశ్నించారు. ప్రశ్నిస్తే బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. బ్లాక్ మెయిల్స్ మాని పొరుగు రాష్ట్రాలతో పోల్చి చూసుకోండన్నారు.



## పొట్టి డ్రెస్సులో బుట్టబొమ్మ పరువాలు.. స్టన్నింగ్

గోపికమ్మా చాలును లేమ్మా ఈ నిదురా.. అంటూ గోపిక వేశంతో అందర్నీ ఆశ్చర్య పరిచి బుట్టబొమ్మా.. బుట్టబొమ్మ డ్యాన్స్ తో టాలీవుడ్ ను ఓ ఊపు ఊపిన పూజా హెగ్డే గురించి తెలుగు సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మాస్క్ అనే తమిళ సినిమాతో 2012లో సినీ రంగంలో అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ... ఒక లైలా కోసం చిత్రం ద్వారా టాలీవుడ్ కు ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ముకుంద డీజే రంగస్థలం అరవింద సమేత మహర్షి అల వైకుంఠపురంలో వంటి బ్లాక్ బస్టర్ హిట్టు చిత్రాల్లో నటించి తన టాలెంట్ ప్రూవ్ చేసుకుంది. అతి తక్కువ కాలంలోనే తన అందం అభినయంతో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఓ వైపు సినిమాలు చేస్తూ బిజీగా ఉంటూనే మరోవైపు సోషల్ మీడియాల ద్వారా తన అభిమానులకు టచ్ లో ఉంటుంది. తాజాగా ఈ పొడుగు కాళ్ల సుందరి



ఇన్ స్టా వేదికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. అందులో రెడ్ కలర్ పొట్టి డ్రెస్సులో అదిరిపోయింది. అందాలన్నీ ఆబోస్తూనే కుర్రకారు గుండెల్లో హీటు పుట్టిస్తోంది. ఎద అందాలు క్లీవేజ్ తో పాటు నడుము ఒంపుసొంపులు థైస్ అందాలను చాలా క్లియర్ గా చూపిస్తోంది. హెయిర్ లీవ్ చేసి స్పెక్స్ చేత పట్టుకొని.. దాని కొన కొరుకుతూ చాలా స్టైలిష్ గా కూర్చుంది. అలాగే డ్రెస్సుకు మ్యాచింగ్ రెడ్ కలర్ పెన్సిల్ హిల్స్ వేసుకొని అందాలను ఆరబోస్తోంది. పడుకొని కూర్చొని సోఫాపై నిల్ డౌన్ చేస్తూ రెచ్చిపోయింది. అసలే అందగత్తె.. ఆపై రెడ్ డ్రెస్సు... విపరీతమైన అందాల ఆరబోత... అబ్బో ఈ ఫొటోలో అమ్మడి అందం గురించి వర్ణించాలంటే కవులు దిగిరావాల్సిందే అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. నీ అందాన్ని తట్టుకోలేక పోతున్నామని హాట్ నెస్ ఓవర్ లోడెడ్ క్యూట్ బ్యూటీ అంటూ చెప్పుకొస్తున్నారు. థైస్ అందాలతో పాటు ఎద అందాలు అదిరాయి అంటూ మరికొంత మంది కామెంట్ల రూపంలో తమ మనసులోని భావాలను వెల్లడిస్తున్నారు. ఈ డ్రెస్సులో పూజ అందాలు అన్నీ కనిపిస్తుండగా... ఒక్కొక్కరు ఒక్కో విధంగా కామెంట్లు చేస్తున్నారు. మీరూ ఓ లుక్కేసేయండి ఈ పొడుగు కాళ్ల సుందరిపై.

## సౌత్ ఇండస్ట్రీపై తాప్సీ వివాదాస్పద వ్యాఖ్యలు

2010 సంవత్సరంలో మంచు మనోజ్ హీరోగా నటించిన 'ఝుమ్మంది నాదం' చిత్రంతో హీరోయిన్ గా తాప్సీ పరిచయం అయింది. మొదటి సినిమానే రాఘవేంద్ర రావు వంటి దిగ్గజ దర్శకుడి దర్శకత్వంలో చేయడంతో తాప్సి కెరీర్ దూసుకు పోతుందని అప్పుడే అంతా భావించారు. అన్నట్లుగానే మొదటి సినిమా ఫ్లాప్ అయినా కూడా టాలీవుడ్ లో మంచి ఆఫర్లు వచ్చాయి. స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశం దక్కింది. కానీ నటిగా ఆమెకు కమర్షియల్ బ్రేక్ మాత్రం దక్కలేదు. భారీ విజయాలు ఆమె ఖాతాలో పడలేదు. దాంతో హిందీలో ఛష్మే బద్దూర్ చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. సౌత్ లో నటిస్తూనే హిందీలో కూడా ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. 2016 నుండి హిందీ సినిమాల్లో బిజీ అయ్యింది. హిందీ సినిమా పరిశ్రమలో అడుగు పెట్టి



పదేళ్లు పూర్తి అయిన సందర్భంగా తాప్సీ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తాజాగా ఒక చిట్ చాట్ లో తాప్సి మాట్లాడుతూ.. బాలీవుడ్ లో మంచి కథలను ఎంపిక చేసుకోవడం వల్ల మంచి ఫలితాలు వచ్చి ఇన్నాళ్ల పాటు కొనసాగాను అంటూ చెప్పుకొచ్చింది. సౌత్ సినీ ఇండస్ట్రీలో హీరోయిన్ గా నటించిన సమయంలో స్టార్ డమ్ దక్కింది కానీ నటిగా ఎప్పుడు కూడా సంతృప్తి దక్కలేదు అంటూ తాప్సీ కామెంట్స్ చేసింది. తాప్సి కామెంట్స్ ప్రస్తుతం వివాదాస్పదం అవుతున్నాయి. సౌత్ లో ఎన్నో పెద్ద సినిమాల్లో నటించడంతో పాటు కొన్ని మంచి పాత్రల్లో నటించి మంచి పేరు దక్కించుకుంది. అయినా కూడా నటిగా సౌత్ లో నటించడం వల్ల సంతృప్తి దక్కలేదు అనడం సౌత్ సినీ ఇండస్ట్రీని అవమానించినట్లే అంటూ సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. బాలీవుడ్ లో మంచి కథలు ఎంపిక చేసుకుని నటించడం వల్ల సంతృప్తి దక్కిందని.. సౌత్ లో స్టార్ డమ్ దక్కినా సంతృప్తి దక్కలేదని తాప్సి చేసిన వ్యాఖ్యలపై పలువురు పలు రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. సౌత్ లో కూడా మంచి కథలను ఎంపిక చేసుకుని నటించాల్సింది కదా అంటూ కొందరు ట్రోల్స్ చేస్తున్నారు. సౌత్ ఇండస్ట్రీ లో చేసిన సినిమాల వల్లే బాలీవుడ్ లో ఆఫర్స్ వచ్చాయి అనే విషయాన్ని గుర్తు పెట్టుకుంటే మంచిదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.




## స్టార్ హోటల్ లాంజ్ లో పిచ్చిలేపుతున్న క్యాట్ ఉమెన్?



2004లో విడుదలైన హాలీ బెర్రీ 'క్యాట్ ఉమెన్' హాలీవుడ్ లో ఒక సంచలనం. ఆ తర్వాత ఇదే తరహా పాత్రలతో పలు ఆంగ్ల చిత్రాలు విడుదలయ్యాయి. కానీ హాలీ బెర్రీ అద్భుత నటన ముందు ఎవరైనా దిగదుడుపే. అచ్చం పిల్లిలాగా ప్రవర్తించడం గోడలెక్కడం గెంతడం మ్యావ్ అంటూ విరుచుకుపడడం సహా ప్రతిదీ ఉత్కంఠను కలిగిస్తాయి. ఇలాంటి ప్రయోగాత్మక సినిమాల వెల్లువ మునుముందు భారతదేశంలోను సాధ్యమేనని అభిమానులు ఆశిస్తున్నారు. రొటీనిటీని జయించిన తెలుగు సినిమా పోకడ దీనికి భరోసాని కల్పిస్తోంది. .ఒకవేళ భారతదేశం నుంచి క్యాట్ ఉమెన్ గా నటించాల్సి వస్తే ఏ హీరోయిన్ సూటబుల్? అనేదానికి ఇదిగో ఇక్కడ సమాధానం లభించింది. 40 ఏళ్ల ప్రియాంక చోప్రా తాజా ఫోటోషూట్ వీక్షించాక వన్ అండ్ ఓన్లీ ఇండియాన్ క్యాట్ ఉమెన్ పీసీ అంటూ పొగిడేయకుండా ఉండలేం. వైట్ థై స్లిట్ గౌను నెక్ లైన్ తో పీసీ తాజా ఫోటోషూట్ వైరల్ అవుతోంది. ప్రియాంక అచ్చంగా క్యాట్ ఉమెన్ ని తలపిస్తోంది. పిల్లి చెవుల మాదిరిగా తన హెయిర్ ని డిజైన్ చేసిన తీరు ఎంతో ఆకట్టుకుంది. ప్రతిసారీ ఫోటోషూట్ల పరంగా ప్రయోగాలు చేసేందుకు వెనకాడని అమెరికా కోడలు ప్రియాంక ఈసారి కూడా దుమారం రేపిందని చెప్పాలి. ఇంతకీ పీసీ ఎక్కడ ఉంది? అంటే... ప్రియాంక చోప్రా జెండాయాతో రోమ్ (ఇటలీ) నగరంలో కనిపించింది. పాపులర్ BVLGARI హోటల్ ప్రారంభోత్సవానికి పలువురు సెలబ్రిటీలతో కలిసి హాజరైంది. ఇక్కడ తెల్లటి రంగు డిజైనర్ దుస్తుల్లో అద్భుతంగా కనిపించింది! హాలీవుడ్ స్టార్ జెండయా సహా ఇతర సభ్యులతో కలిసి పీసీ రెడ్ కార్పెట్ పై కనిపించింది. తనను చూడగానే క్యాట్ ఉమెన్ హాలీ బెర్రీ.. అలాగే 2020లో అరియానా గ్రాండే ను తలపించేలా రెండు పోనీటెయిల్స్ తో తన జుట్టును డిజైన్ చేయించింది. తెల్లటి బూట్లతో కంప్లీట్ రూపాన్ని ప్రదర్శించింది. ఆమె దుస్తులకు సంబంధించిన అనేక వీడియోలు ఫోటోలు అభిమానుల పేజీలలో అప్ లోడ్ అవుతున్నాయి. ప్రియాంక చోప్రా తెల్లటి స్లిట్ గౌనులో నెక్లైన్తో సెక్సీయెస్ట్ క్యాట్ వుమన్ లాగా ఉంది అంటూ ప్రశంసలు కురుస్తున్నాయి.

## టైటిల్ ఫిక్స్.. ఇలా ఊహించలేదు!






నాచురల్ స్టార్ నాని గత నెలలో దసరా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్ కి సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన దసరా సినిమాతో శ్రీకాంత్ ఓదెల దర్శకుడిగా పరిచయం అయ్యారు. కంప్లీట్ మాస్ అండ్ రా కల్ట్ సబ్జెక్టుతో న్యాచురల్ స్టార్ నాని ఈ సినిమా చేయడం విశేషం. తెలంగాణ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కిన ఈ మూవీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మూవీలో నాని పోషించిన ధరణి పాత్ర అయితే బాగా కనెక్ట్ అయింది. నాని కెరియర్ లోనే హైయెస్ట్ కలెక్షన్స్ సొంతం చేసుకున్న సినిమాగా దసరా నిలిచింది. ఇదిలా ఉంటే దసరా రిలీజ్ కి ముందే నాని మరో సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. అది కూడా కొత్త దర్శకుడుతోనే చేయడం విశేషం. శౌర్యువ్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతూ ఉన్నారు. నాచురల్ స్టార్ నాని 30వ సినిమాగా ఇది తెరకెక్కుతూ ఉండడం విశేషం. బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాగూర్ ఈ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. సీతారామం లాంటి బ్లాక్ బస్టర్ సినిమా తర్వాత మృణాల్ ఠాగూర్ తెలుగులో చేస్తున్న రెండో సినిమా ఇది కావడం విశేషం. తండ్రి కూతుళ్ళ అనుబంధం బ్యాక్ డ్రాప్ లో ఈ మూవీ కథ ఉండబోతుంది అని ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమా విడాకులు తీసుకున్న భార్య భర్తల మధ్య నలిగిపోయే చిన్నారి పాత్ర దృక్కోణం నుంచి ఉండబోతుందని ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది. ఇప్పటికే మృణాల్ ఠాకూర్ ఇదొక అద్భుతమైన కథ అని చెప్పారు. ఇదిలా ఉంటే హాయ్ నాన్న అనే టైటిల్ ఈ సినిమాకి నిర్ణయించినట్లుగా ప్రచారం నడుస్తోంది. తండ్రి కూతుర్ల అనుబంధం ప్రధాన ఇతివృత్తం కావడంతో ఈ ఇంట్రెస్టింగ్ టైటిల్ మూవీకి ఫైనల్ చేసినట్లుగా టాక్. గతంలో నాని జెర్సీ సినిమాలో తండ్రి కొడుకుల మధ్య ఎమోషనల్ బాండింగ్ నేపథ్యంలో కథాంశాన్ని ఆవిష్కరించి బ్లాక్ బాస్టర్ కొట్టారు. ఈ నేపథ్యంలో మరోసారి అలాంటి ఎమోషనల్ అటాచ్మెంట్ స్టోరీని తెరపై ఆవిష్కరిస్తూ ఉండడం ఆసక్తికరంగా మారింది.

## సాయం సంధ్యలో మయూరం పురి విప్పెను

నిహారిక కొణిదెల వ్యక్తిగత జీవితం.. బ్రేకప్ గురించి నిరంతరం మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ ప్రచారాన్ని నిహారిక ఖండించను లేదు.. ఖరారు చేయనూ లేదు. కానీ ఇటీవల సోషల్ మీడియా ఫోటోషూట్లు చూస్తుంటే నిహారిక తిరిగి కథానాయికగా రీఎంట్రీ ఇవ్వడం ఖాయమని హింట్ ఇస్తున్నాయి. మునుపటితో పోలిస్తే నిహారిక ఫోటోషూట్లలో గ్లామర్ హంగు పెరిగిందంటూ అభిమానులు గుర్తిస్తున్నారు. తాజాగా సోషల్ మీడియాల్లో నిహారిక లేటెస్ట్ ఫోటో ఒకటి వైరల్ గా మారింది. ఇందులో ఊదారంగు చీరలో నిహారిక పోర్ట్రెయిట్ సంథింగ్ స్పెషల్ గా ఉందంటూ ఫ్యాన్స్ కితాబిచ్చేస్తున్నారు. గిరజాల జుట్టు ముక్కుకు ముక్కెర ఆభరణాలతో మెగా ప్రిన్సెస్ ఎంతో



ఒద్దికగా కనిపిస్తోంది. సాయం సంధ్యా సమయం ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ అందమైన ఫోటోఫ్రేమ్ అద్భుతంగా కెమెరాలో బంధీ అయింది. ఇది అభిమానుల హృదయాల్ని టచ్ చేసింది. సాయం సంధ్యలో మయూరం పురి విప్పినంత అందంగా మెగా ప్రిన్సెస్ కనిపిస్తోందంటూ ఫ్యాన్స్ మైమరిచిపోతున్నారు. వివాహానికి ముందు టాలీవుడ్ లో కథానాయికగా .. నిర్మాతగా రాణించేందుకు నిహారిక చేసిన ప్రయత్నాల గురించి తెలిసిందే. బుల్లితెర హోస్ట్ గాను నిహారిక అభిమానులను సంపాదించుకున్నారు. ఇప్పుడు మరోసారి మునుపటిలా యాక్టివ్ అవ్వబోతోందంటూ ఫ్యాన్స్ ఊహిస్తున్నారు. పెళ్లి తర్వాత నటనకు దూరంగా ఉన్న నీహారిక తిరిగి కథానాయికగా రీఎంట్రీ ఇచ్చేది ఎప్పుడు? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## సుస్మితా సేన్ బ్యాక్ టూ యాక్షన్!

సీనియర్ నటి సుస్మితా సేన్ ఇటీవల అనారోగ్యానికి గురైన సంగతి తెలిసిందే. హృదయ సంబంధిత సమస్యలు ఎదుర్కోవడంతో కెమెరాకి దూరంగా ఉండాల్సి వచ్చింది. తాజాగా సుస్మిత అనారోగ్యం నుంచి కోలుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మళ్లీ కెమెరా ముందుకు రావడానికి రెడీ అవుతున్నారు. దీనిలో వెబ్ సిరీస్ 'ఆర్య-3' షూటింగ్ షురూ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ సిరీస్ షూటింగ్ జైపూర్ లో జరుగుతోంది. దీనిలో భాగంగా ఆదివారం ఆమె షూట్ కి హాజరయ్యారు. నేటి నుంచి యధావిధిగా షూటింగ్ లో పాల్గొంటున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసారు. 'ప్రస్తుతం నేను పూర్తిగా కోలుకున్నాను. సరిపోయినంత విశ్రాంతి తీసుకున్నాను. ఎక్కడైతో అస్వస్తతకి గురయ్యానో? అక్కడికి సంపూర్ణ ఆరోగ్యం వస్తున్నా. 'ఆర్య-3' మూడవ భాగం ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ఇక ఎంత మాత్రం సమయం వృద్ధా చేయను'



అని తెలిపారు. ఇంతకు ముందు సుస్మితసేన్ ప్రధాన పాత్రలో 'ఆర్య'..'ఆర్య2' వెబ్ సిరీస్ లు తెరకెక్కిన సంగతి తెలిసిందే. వాటికి కొనసాగింపుగా వస్తోన్న మూడవ భాగమిది. రామ్ మద్వానీ..సందీప్ మోదీలు సంయుక్తంగా తెరకెక్కిస్తోన్న వెబ్ సిరీస్ ఇది. రెండు భాగాలకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో మూడవ భాగం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ఆ భాగాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. అయితే రిలీజ్ తేదీని మాత్రం ఇంకా ప్రకటించలేదు. చిత్రీకరణ అనంతరం తేదీ ప్రకటించే అవకాశం ఉంది. అలాగే ఆ మధ్య సుస్మితా సేన్ వ్యాపార వేత్త లలిత్ మోదీతో ప్రేమలో ఉన్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. పెళ్లి కూడా చేసుకుంటు న్నట్లు ప్రకటించారు. అయితే ఆ తర్వాత ఆ ప్రేమాయణం ఎంత వరకూ వచ్చిందన్నది ఎలాంటి అప్ డేట్ లేదు. ఈనేపథ్యంలో విడిపోయారని ప్రచారం సాగింది. అయితే ఈ ప్రచారం పై వాళ్లిద్దరు ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వలేదు. సుస్మితా సేన్ మాత్రం వృత్తిగత జీవితంపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తుంది.





# గద్వాల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆఫీసును ప్రారంభించిన సీఎం కేసీఆర్

జోగులాంబ గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లా బీఆర్ఎస్ పార్టీని ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. మొదట తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్ఛరణాల మధ్య శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి పార్టీ కార్యాలయాన్ని కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల్ జిల్లా పార్టీ ఇంచార్జి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కుర్చీలో కూర్చోబెట్టారు కేసీఆర్. ఈ కార్యక్రమంలో మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అంబ్రహం, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్, శాట్స్ చైర్మన్ ఆంజనేయులు గౌడ్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**గద్వాల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆఫీసును ప్రారంభించిన సీఎం కేసీఆర్**
: జోగులాంబ గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లా బీఆర్ఎస్ పార్టీని ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. మొదట తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్ఛరణాల మధ్య శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి పార్టీ కార్యాలయాన్ని కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల్ జిల్లా పార్టీ ఇంచార్జి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కుర్చీలో కూర్చోబెట్టారు కేసీఆర్. ఈ కార్యక్రమంలో మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అంబ్రహం, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్, శాట్స్ చైర్మన్ ఆంజనేయులు గౌడ్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కుసుమ జగదీశ్‌కు నివాళులర్పించిన మంత్రి కేటీఆర్..

ములుగు: బీఆర్ఎస్ ములుగుజిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీశ్ భౌతిక కాయానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ నివాళులర్పించారు. ములుగు జిల్లా మల్లంపల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్న మంత్రి కేటీఆర్.. జగదీశ్ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. మంత్రి కేటీఆర్‌తోపాటు మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీలు సంతోష్ కుమార్, రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే బాల్కా సుమన్.. జగదీశ్‌కు నివాళులర్పించారు. కుసుమ జగదీశ్వర్ (47) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. హనుమకొండ స్నేహనగర్‌లో ఉంటున్న ఆయన ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఇంట్లో స్నానం చేసి బయటకు వస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. గన్‌మెన్ల సాయంతో భార్య రమాదేవి వెంటనే ఆయనను హనుమకొండలోని లైఫ్‌లైన్ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు తరలించాలని సూచించగా సమయం లేకపోవడంతో అక్కడే అజార దవాఖానకు తీసుకెళ్లారు. అయితే అక్కడ చికిత్స అందిస్తుండగానే కన్నుమూశారు. 14 ఏండ్లపాటు హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోనే ఉంటూ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో జగదీశ్ కీలక పాత్ర పోషించారు. గత ఎన్నికల సమయంలో ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

ములుగు జిల్లా ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆయనకు జిల్లా పరిషత్ చైర్మన్ అవకాశం కల్పించారు. ఏప్రిల్ 1న జగదీశ్వర్ తొలిసారి గుండెపోటుకు గురికాగా భార్య రమాదేవి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. ఆ తర్వాత హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స తీసుకున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న నిర్వహించిన సంక్షేమ సంబురాల్లోనూ పాల్గొన్నారు.

# గద్వాల ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్



జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రారంభోత్సవం చేశారు. మొదట కార్యాలయానికి చేరుకున్న సీఎంకు హోంమంత్రి మహమూద్ అలీ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, డీజీపీ అంజనీకుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంకు పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కార్యాలయ శిలాఫలకాన్ని ప్రారంభించారు. కార్యాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎస్పీ చాంబర్‌లో జిల్లా పోలీస్ అధికారి సృజనను కూర్చోబెట్టి.. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా.. గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయ సముదాయాన్ని ప్రభుత్వం రూ.38.50 కోట్లతో నిర్మించింది. కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహించేందుకు నాలుగు ఫోర్లు, 45 గదులు, సమీక్ష సమావేశాల కోసం కాన్ఫరెన్స్‌హాల్, ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేశారు. సాయుధ దళపతి కార్యాలయంతోపాటు ఆర్మ్‌డ్ సిబ్బంది ఉండేలా రెండు బరాక్‌లు నిర్మించారు. ల్యాబ్ సౌకర్యం, ఫోరెన్సిక్, సైబర్, క్లూస్‌టీం కోసం సైతం వసతులు కల్పించారు. డాగ్, బాంబ్ స్కాడ్ సిబ్బందికి వసతి కూడా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సీఎస్ శాంతికుమారి, మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహం, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ వల్లూరి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో యువత భాగస్వాములవ్వాలి: మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్: ఐటీ, పారిశ్రామిక రంగాల్లో తెలంగాణతో మరే రాష్ట్రం పోటీ పడటంలేదని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఇదేవిధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో యువత భాగస్వామ్యం వహించాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాల్లో సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలను అత్యంత సమర్ధవంతంగా అమలు చేస్తూ దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లో నిర్వహించిన తెలంగాణ రన్‌ను మంత్రి మహమూద్ అలీతో కలిసి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణ శరవేగంగా పురోగమించడానికి ప్రధాన కారణమైన ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే నంబర్ వన్ సీఎం అని మంత్రి మహమూద్ అలీ అన్నారు. మరే ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధితో తెలంగాణ దేశంలోనే అగ్రభాగంలో నిలిచిందని చెప్పారు. అంచనాలకు మించి..తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రన్‌కు పెద్ద సంఖ్యలో యువత హాజరు కావడంతో విజయవంతంగా కొనసాగింది. హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి ప్రారంభమైన 2కే, 5కే రన్‌లకు ముఖ్య అతిథులుగా మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ హాజరయ్యారు. క్రీడాకారులు ఈషా సింగ్, గాయకులు మంగ్లీ, రామ్, సినీ నటి శ్రీ లీల పాల్గొన్నారు. రన్ ప్రారంభానికి ముందు గాయకులు మంగ్లీ, రామ్ ఆలపించిన పాటలు యువతీ, యువకులను ఉత్సాహపరిచాయి. దాదాపు 4 వేల మందకిపైగా రన్నర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతిని ప్రతిభింబించే బోనాలు, బతుకమ్మలు, డప్పులు, ఇతర నృత్యాలతో హోరెత్తించారు. పోలీస్ అశ్విక దళం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# కాళేశ్వరం కమీషన్లకే పనికి వచ్చింది: ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



కరీంనగర్: వైన్ గంగ లేకపోతే కాళేశ్వరం లేదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. తుమ్మడి హట్టి వద్ద నిర్మాణం చేస్తే.. మేడిగడ్డ అన్నారం అవసరం లేకుండేనని పేర్కొన్నారు.

కాళేశ్వరం కమీషన్లకే పనికి వచ్చిందని విమర్శించారు. పోతి రెడ్డి పాడు నీటిని ఆంధ్ర నేతలు తరలిస్తే.. కేసీఆర్ ఏం చేస్తున్నారు? అని ఆయన ప్రశ్నించారు. జగన్‌తో కుమ్మక్కు అయ్యావా కేసీఆర్? అని ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు నీటి తరలింపు కేసీఆర్ వైఫల్యమేనన్నారు. దశాబ్ది ఉత్సవాలకు ఎవరూ రావడం లేదని విందులు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు.




**హైదరాబాద్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని నెక్లెస్‌రోడ్డులో 'తెలంగాణ రన్' నిర్వహించారు. ఈ రన్‌కు ముఖ్యఅతిథులుగా మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, సినీనటి శ్రీలీల పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. పెద్ద ఎత్తున యువతీ యువకులు తరలివచ్చి ఈ రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.**

# తెలంగాణ వ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభం



హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా పాఠశాలలు పున:ప్రారంభమయ్యాయి. వేసవి సెలవులు ముగియడంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలు తిరిగి మొదలయ్యాయి. దాదాపు 55 లక్షల మంది విద్యార్థులు బడిబాట పట్టారు.

ఈ ఏడాది నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ నోట్‌బుక్స్ పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. యూనిఫాం, పాఠ్య పుస్తకాలతో పాటు నోట్‌బుక్స్ పంపిణీ జరుగనుంది. 1 నుంచి 5 తరగతులకు వర్క్ బుక్స్, 6 నుంచి 10 విద్యార్థులకు నోట్ బుక్స్‌ను ఇవ్వనున్నారు. మధ్యాహ్నం భోజనంలో ఒకరోజు కిచిడి, మరో రోజు వెజిటేబుల్ బిర్యానిని విద్యార్థులకు ఇవ్వనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది ప్రారంభించిన ఇంగ్లీషు మీడియం కొనసాగనుంది. గత ఏడాది 1 నుంచి 8వ తరగతి వరకు అమలు చేసిన ఇంగ్లీషు మీడియాన్ని ఈ ఏడాది 9వ తరగతి వరకు పొడిగించారు. వచ్చే ఏడాది 10వ తరగతి వరకు అమలు చేయనున్నారు.

# తెలంగాణ పోలీసులపై నమ్మకం లేకే సీబీఐని ఆశ్రయించా.. దుర్గం చిన్నయ్యపై శేజల్

న్యూఢిల్లీ: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై బాధితురాలు శేజల్ సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శేజల్ మీడియాతో మాట్లాడుతూ... పోలీసులకు డబ్బులు ఇచ్చి ఎమ్మెల్యే మ్యానేజ్ చేస్తున్నారని ఆరోపించారు. అందుకు సంబంధించిన ఆధారాలను సీబీఐకి ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ పోలీసు దర్యాప్తుపై నమ్మకం లేకే సీబీఐని ఆశ్రయించినట్లు చెప్పారు. పారదర్శకంగా దర్యాప్తు చేయాలనీ సీబీఐని కోరామన్నారు. "నాపై తప్పుడు కేసులు పెడుతూ వేధింపులకు పాల్పడుతున్నారు. నా దగ్గర ఉన్న ఆడియో టేప్స్, ఇతర ఆధారాలను సీబీఐకి అందజేశాం. సీబీఐ దర్యాప్తు చేస్తామని చెప్పింది. రైతులను మోసం చేస్తే ఢిల్లీకి ఎందుకు వస్తాం. మోసపోయిన రైతులు ఉంటే రావాలని కోరుతున్నా ఎవరు రావడం లేదు. ఇన్వెస్ట్‌మెంట్ చేసివాళ్లకు షేర్లు ఇచ్చాము, ఎమ్మెల్యే సపోర్ట్ ఇస్తామని చెప్పినందుకే ఆయనకు షేర్ ఇచ్చాము. దుర్గం చిన్నయ్యపై కేసు నమోదై విచారణ జరిపేంత వరకు ఢిల్లీలోనే ఉంటాం. బెల్లంపల్లి లోకల్ పోలీసులు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చెప్పినట్టు అనుసరిస్తున్నారు. మా పై కేసులు పెడుతున్నారు, ఎమ్మెల్యే అనుచరులు బెదిరిస్తున్నారు. తెలంగాణ పోలీసులు సంప్రదిస్తే అన్ని అంశాలు వివరిస్తాను. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు ప్రయత్నం చేస్తున్నాము.. వారే మాకు న్యాయం చేయాలి" అని బాధితురాలు శేజల్ వెల్లడించారు. ఇప్పటికే దుర్గం చిన్నయ్యపై ఎన్‌సీడబ్ల్యూకి శేజల్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

దుర్గం చిన్నయ్య అనుచరులు పదే పదే వేధిస్తున్నారంటూ కొన్నిరోజుల క్రితం ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద శేజల్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అయితే భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి శేజల్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించడంతో ఆమె ప్రాణాలతో బయటపడ్డారు. ఆపై ఆరోగ్యం కుదుటపడిన అనంతరం ఎన్‌సీడబ్ల్యూతో పాటు అనేక కమిషన్లను కలిసి తన బాధను వెల్లడించారు. నిన్న బీఆర్ఎస్ జాతీయ కార్యాలయం ఎదుట కూడా శేజల్ ధర్నా చేశారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వల్ల ఇబ్బందులకు గురవుతున్న మహిళలకు రక్షణ కలిపించాలని, తక్షణమే ఎమ్మెల్యే పదవి నుంచి తప్పించి, పార్టీ నుంచి తొలగించి కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో ఎమ్మెల్యేపై తెలంగాణ సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి

# శిరీష మృతి కేసు.. పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు..

వికారాబాద్ జిల్లా: పరిగి మండలం కాడ్లాపూర్‌లో యువతి శిరీష అనుమానాస్పద మృతిపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. యువతి సెల్ ఫోన్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. శిరీష అంత్యక్రియల అనంతరం ఆమె తండ్రి జంగయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాల్ డేటా ఆధారంగా శిరీష మృతి చెందిన మరుసటిరోజు యువతి ఫోన్ నుంచి ఓ వ్యక్తికి కాల్ వెళ్ళినట్టు పోలీసులు గుర్తించారు.

రాత్రి గొడవ జరిగినప్పుడు శిరీష వద్ద నుంచి ఫోన్ లాగేసుకున్నానని పోలీసుల విచారణలో బావ అనిల్ చెప్పాడు. ఉదయం ఫోన్ నుంచి కాల్ వెళ్ళినప్పటికీ తనకు ఫోన్ పాస్వర్డ్ తెలియదంటూ అనిల్ బుకాయించే ప్రయత్నం చేశాడు. డాటా డిలీట్ కాకుండా సిడిఆర్ ద్వారా కాల్ హిస్టరీ సేకరించే ప్రయత్నం. కొంత సమయం గడిస్తే కేసు చిక్కుముడి వీడే అవకాశముంది. కాగా వికారాబాద్ జిల్లాలోని పరిగి కాడ్లాపూర్‌లో యువతి శిరీష అనుమానాస్పద మృతి కేసులో పోలీసుల విచారణపై అన్న శ్రీకాంత్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య.. ఆత్మహత్య అంటూ పోలీసులు తికమక చేస్తున్నారంటూ ఆవేదన చెందారు. ఆ చిన్న కుంటలో మోకాలి లోతు నీటిలో ఎలా ఆత్మహత్య చేసుకుంటారో చెప్పాలని యువతి అన్న శ్రీకాంత్ ప్రశ్నించారు. ఆ కుంటలో ఎలాంటి రాళ్ళు లేవన్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు సమగ్ర విచారణ చేయాలని..తమ కుంటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. "మా నాన్న తప్పు చేసినా... బావ తప్పు చేసిన శిక్షించాలి" అని అన్నారు. అసలు నిజం నిగ్గు తెల్చాలని డిమాండ్ చేశారు. మరోవైపు పోలీసుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సరిగ్గా విచారణ చేయడం లేదని అన్నారు. శిరీషది ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. యువతి మృతికి తండ్రి, బావ ఇద్దరు కారణమని.. పోలీసులు సరిగ్గా విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com